ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు



శుక్రవారం 5 డిసెంబరు 2025 | 5



మామిడికుదురు నుంచి చించినాడ వరకు 22 కిలోమీటర్ల 216 హైవే



రైల్వేశాఖ మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ హరీష్

కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్‌ను త్వరితగతిన పూర్తి చేయండి

» కేంద్ర రైల్వే మంత్రిని కోరిన అమలాపురం ఎంపీ హరీష్

అమలాపురం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కోనసీమ వాసుల ఆకాంక్షలకు అనుగుణంగా కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్ పనులను వేగవంతం చేయాలని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కోరారు. ఢిల్లీలోని మంత్రి కార్యాలయంలో గురువారం ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎంపీ హరీష్ కోనసీమ రైల్వేలైన్, ద్వారపూడి రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యాలను మరింత మెరుగు పరచాలని కోరుతూ వినతిపత్రం అందించారు. కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్ కోనసీమ ప్రజల చిరకాల వాంఛ అని, దీన్ని త్వరితగతిన నెరవేర్చడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. రాబోయేరోజుల్లో రైల్వేలైన్ పనులు మరింత వేగవంతం చేయాలని ఎంపీ కోరారు. ద్వారపూడి రైల్వేస్టేషన్‌లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఎంపీ చేసిన వినతిపై రైల్వేమంత్రి సానుకూలంగా స్పందించినట్టు ఎంపీ హరీష్ ఒక ప్రకటనలో తెలిపారు. తాళ్లరేవు మండలం కోరంగి గ్రామంలో విమానాశ్రయం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కేంద్ర విమానయానశాఖ మంత్రి కె.రామ్మోహననాయుడును మరోసారి కలసి కోరామని తెలిపారు. విమాన సర్వీసును కోనసీమ జిల్లాకు విస్తరింప చేయడం వల్ల భవిష్యత్తులో ఎంతో మేలు జరుగుతుందని, చమురు సంస్థలతోపాటు పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న కోనసీమకు విమాన సర్వీసు ఏర్పాటు తప్పనిసరి అని మంత్రి దృష్టికి తీసుకువెళ్లినట్టు ఆయన వివరించారు.



అక్రమ.. పరుగులు!

» లేఅవుట్ల క్రమబద్ధీకరణకు పరుగులు
» ఎల్‌ఆర్‌ఎస్‌కు 15598 దరఖాస్తులు
» ప్రభుత్వానికి రూ.127 కోట్ల రాబడి
» గత వైసీపీలో భారీగా అక్రమ లేఅవుట్లు
» చూసీచూడనట్లు వదిలేసిన అధికారులు
» కూటమి అధ్యయనం ..లబ్ధిదారులకు ఛాన్స్

అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణకు ఉమ్మడి జిల్లాలో భారీగా దరఖాస్తులు వెల్లువెత్తుతు న్నాయి. ప్రభుత్వం ప్రకటించిన ఎల్‌ఆర్‌ఎస్ పథకానికి అంచనాలకు మించిన స్పందన వ్యక్త మవుతోంది. అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణకు భారీగా దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటి వరకు 15,598 దరఖాస్తులు పోటెత్తాయి. దీన్ని బట్టి గత వైసీపీ సర్కారు హయాంలో ఏ స్థాయిలో అక్రమ లేఅవుట్లు పురుడు పోసుకున్నాయో అర్థం చేసుకోవచ్చు. మరోపక్క వచ్చిన ఎల్ఎఆర్‌ఎస్ దరఖాస్తుల ద్వారా ప్రభుత్వానికి రూ.127 కోట్ల వరకు రాబడి రానుంది. అత్యధికంగా తూర్పుగోదావరి జిల్లాలో 7,390 ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు రావడం విశేషం. వచ్చే నెల వరకు గడువు ఉండడంతో వీటి సంఖ్య మరింత పెరగనుంది.

- (కాకినాడ,ఆంధ్రజ్యోతి)

రాష్ట్రప్రభుత్వం ఈ ఏడాది జూలైలో లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకాన్ని (ఎల్‌ఆర్‌ఎస్) ప్రవేశ పెట్టింది. అనుమతుల్లేకుండా వేసిన లేఅవుట్లను ఈ పథకం ద్వారా క్రమబద్ధీకరించుకునే అవకాశం కల్పించింది. దీంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వేలల్లో దరఖాస్తులు పోటెత్తుతున్నాయి. వాస్తవా నికి 2014-2019 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ పథకాన్ని తెచ్చింది. ఆ తర్వాత గడువు ముగియడంతో నిలిపివేసింది. అప్పట్లో వచ్చిన దరఖాస్తుల్లో 65 శాతం వరకు పరిష్కరించింది. గత వైసీపీ ప్రభుత్వంలో మళ్లీ అనుమతులు తీసుకోని అక్రమ భవనాలు, లేఅవుట్లు భారీగా పెరిగాయి. అప్పటి అధికార పార్టీ నేతలు, వారి అనుచరులు ఎక్కడికక్కడ అక్రమ లేఅవుట్లు వేసి విక్రయించి కోట్లు గడించారు. ఇవన్నీ తెలిసినా అధికారులు పట్టించు కోలేదు. అత్యధికంగా తూర్పుగోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం రూరల్, కొవ్వూరు, నిడద వోలు, రాజానగరం, కాకినాడ రూరల్ నియోజక వర్గాల్లో ఈ తరహా లేఅవుట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి.

'తూర్పు'న 7,390..

ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా తూర్పుగోదా వరి జిల్లా నుంచి ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు భారీగా పోటెత్తాయి.జిల్లాలో డిసెంబరు 1 వరకు మొత్తం 7,390 ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు వచ్చాయి. రాజమహేంద్రవరం కార్పొరేషన్ పరి ధిలో 1,305, రుడా పరిధిలో 5,266, నిడదవోలు మునిసిపాలిటీ 291, కొవ్వూరు పరిధిలో 528 వచ్చాయి. మొత్తం 5,255 దరఖాస్తుల్లో 1,384 అప్రూవల్ అవగా 522 దరఖాస్తులను తిరస్కరించారు. దరఖాస్తుల ద్వారా ఎల్‌ఆర్‌ఎస్ ఆదాయం ప్రభుత్వానికి రూ.60.88 కోట్లు సమకూరనుంది. కార్పొరేషన్ పరిధిలో రూ.27.59 కోట్లు, రుడా ద్వారా రూ.25.78 కోట్లు జమకానుంది.

కాకినాడలో 5,839

కాకినాడ జిల్లాలో 5,839 ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు రాగా రూ.44.71 కోట్లు ఆదాయం రానుంది. అత్యధికంగా కుడా పరిధిలో 4,327, కాకినాడ కార్పొరేషన్ పరిధిలో 316, ఉమ్మడి గుడాలో 305, గొల్లప్రోలు 55, పెద్దాపురం 115, పిఠాపురం 453, సామర్లకోట 58, తుని 149, ఏలేశ్వరంలో 59 చొప్పున వచ్చాయి. మొత్తం 5,839 దరఖాస్తుల్లో 2,780 అప్లికేషన్లకు ఆమో దం లభించగా 320 తిరస్కరించారు.

నాటి ధరలే నేడూ..

అనధికార లేఅవుట్లలో స్థలాలు కొనుగోలు చేసిన వారు ఇళ్లు నిర్మించుకునేందుకు అవకాశం లేదు. దీంతో వారంతా లబోదిబోమన్నారు. ప్రభుత్వం మారాక వీటిపై అధ్యయనం చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు.ఈ నేపథ్యంలో ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా వీటి క్రమబద్ధీకర ణకు ప్రభు త్వం అవకాశం కల్పించింది. ఈ ఏడాది జూన్ 30కి ముందు వేసిన లేఅవుట్లను ఈ పథకం కింద క్రమబద్ధీకరించు కోవడానికి ప్రభుత్వం అనుమతి జారీ చేసింది. 2014- 2019లో అప్పటి టీడీపీ ప్రభుత్వం తీసుకు వచ్చిన ఎల్‌ఆర్‌ఎస్‌లో నిర్దే శించిన బేసిక్ ధరలనే ఇప్పుడు నిర్ణయిం చారు. ఎల్‌ఆర్ ఎస్ అపరాధ రుసుముల కింద ప్లాట్ విస్తీర్ణం చదరపు మీటర్లలో 100 వరకు ఉంటే రూ.200,100-300 ఉంటే రూ.400, 300-500 వరకు రూ.600, 500పైన రూ.750 వరకు వసూలుకు నిర్ణయించారు. లేఅవుట్‌లో 10శాతం ఓపెన్ స్పేస్ లేకపోతే జరిమానాతో పాటు ఈ ఏడాది జూన్ 30వ తేదీ నాటికి ఆ భూమి బేసిక్ విలువలో ఓపెన్ స్పేస్ ఛార్జీల కింద 14 శాతం చెల్లించాలని ప్రభుత్వం ఆదేశించింది. క్రమబ ద్ధీకరణ కింద ఫీజులు 45 రోజుల్లోగా చెల్లిస్తే 10 శాతం, 90 రోజుల్లోగా చెల్లిస్తే ఐదు శాతం రాయితీ ప్రకటించింది. జూలైలో పథకాన్ని ప్రవేశపెట్టగా అక్టోబరు వరకు ప్రభుత్వం గడువిచ్చింది.తిరిగి వచ్చే నెల జనవరి 23వరకు పొడిగించింది.

కోనసీమలో 2,369

బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 2,369 దరఖాస్తులు వచ్చాయి. అమలాపురం మునిసిపాలిటీలో 437,అముడా 627, మండపేట 844, రామచంద్రపురం 182, ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలో 279 చొప్పున వచ్చాయి. మొత్తం దరఖాస్తుల్లో 983 ఆమోదం పొందగా 89 తిరస్కరణకు గురయ్యాయి. కోనసీమ జిల్లాలో వచ్చిన మొత్తం దరఖాస్తుల ద్వారా రూ.21.45 కోట్లు ప్రభుత్వానికి ఆదాయం సమకూరనుంది.ఉమ్మడి జిల్లా అంతా రూ.127 కోట్లు ఆదాయం సమకూరనుండగా ఇప్పటికే చాలా మంది అపరాధ రుసుములు చెల్లించడం ద్వారా సగానికిపైగానే వచ్చినట్టు అధికారులు పేర్కొన్నారు.



రయ్.. రయ్

» మామిడికుదురు-చించినాడ బైపాస్ రహదారి నిర్మాణం పూర్తి
» దూసుకుపోతున్న వాహనాలు
» 22 కిలోమీటర్ల సీసీ రోడ్డు నిర్మాణంతో జిల్లావాసుల హర్షం
» తాటిపాక, రాజోలు సెంటర్లపై బైపాస్ ఎఫెక్ట్

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

ఎన్నో ఏళ్లుగా అసంపూర్తిగా నిలిచిన జాతీయ రహదారి బైపాస్ రోడ్డు నిర్మాణం ఎట్టకేలకు పూర్తయింది. దీంతో వందలాది వాహనాలు బైపాస్ రహదారి గుండా రయ్‌రయ్ మంటూ దూసుకుపోతున్నాయి. ఈ బైపాస్ రోడ్డు నిర్మాణం పూర్తి కావడంతో ప్రయాణికులకు సౌకర్యంగా ఉండగా సమీపంలోని ప్రధానమైన ప్రాంతాల్లో వ్యాపార లావాదేవీలు లేక వర్తకులు ఆందోళన చెందుతున్నారు.

ఎంపీ, ఎమ్మెల్యే సహకారంతో..

కత్తిపూడి నుంచి పామర్రు వరకు వెళ్లే 216 రహదారి అభివృద్ధిలో భాగంగా వివిధ ప్రాంతాల్లో కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వశాఖ బైపాస్ రహదారుల నిర్మాణానికి గత దశాబ్దంనర క్రితమే శ్రీకారం చుట్టింది. దీనిలోభాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని ముమ్మిడివరం, అనాతవరం, అమలాపురం బైపాస్ రోడ్లు ఇప్పటికే నిర్మాణాలు పూర్తయి ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు. కోర్టు కేసులు, ఇతర వివాదాల కారణంగా పాశర్లపూడినుంచి కడలి మీదుగా చించినాడ వెళ్లే రహదారి నిర్మాణంలో ఎన్నో అవాంతరాలు తలెత్తాయి. 216 జాతీయ రహదారి అభివృద్ధి విస్తరణలో భాగంగా పాశర్లపూడి దాటిన తర్వాత మామిడికుదురు సమీపంనుంచి బైపాస్ రోడ్డు నిర్మాణాన్ని జాతీయ రహదారులశాఖ అధికారులు చేపట్టారు. పాశర్లపూడి నుంచి కడలి వరకు వెళ్లే బైపాస్ రహదారి నిర్మాణంలో ఎన్నో అవాంతరాలు ఎదురయ్యాయి. కోర్టు వివాదాల కారణంగా కొన్నిచోట్ల పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లా అధికారులతోపాటు ఎంపీ హరీష్, ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సంయుక్త సహకారంతో మామిడికుదురు సమీపం నుంచి కడలి వరకు 216 జాతీయ రహదారి సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయింది. దీంతోపాటు కడలి నుంచి చించినాడ వరకు వెళ్లే సీసీ రోడ్డు కూడా ఇంతకుముందే నిర్మితమై వాహనాల రాకపోకలకు అధికారులు అనుమతించారు.

అవధుల్లేని ఆనందం

పాశర్లపూడి, మామిడికుదురు మధ్యలో నుంచి ప్రారంభమైన హైవే సీసీ రోడ్డు 22 కిలోమీటర్ల మేర వివిధ గ్రామాల గుండా పయనిస్తూ చించినాడకు సమీపంలోని పెట్రోలు బంకు వద్ద హైవేలో ఈ బైపాస్ రహదారి కలుస్తుంది. రాకపోకలకు క్లియరెన్సు లభించడంతో నిత్యం ఈ రహదారిపై వందలాది వాహనాలు, వేలసంఖ్యలో మోటారుసైకిళ్లు జోరుగా ప్రయాణిస్తున్నాయి. దిండి-చించినాడ వారధిపై భారీ వాహనాలు నిలుపుదల చేయడంతో ఫోర్‌వీలర్స్ అన్నీ ఈ రహదారి గుండా పశ్చిమగోదావరి జిల్లాకు వెళ్తున్నాయి. ఎట్టకేలకు 216 బైపాస్ రహదారి చించినాడ వరకు పూర్తి కావడంతో జిల్లావాసుల ఆనందాలకు అవధుల్లేకుండాపోయాయి. ఈ రహదారి నిర్మాణంవల్ల మామిడికుదురు, నగరం, తాటిపాక, రాజోలు, శివకోడు సెంటర్‌లో వ్యాపార, వాణిజ్య సంస్థలు వ్యాపార లావాదేవీలు తగ్గివారు నిరుత్సాహానికి గురవుతున్నారు. ఇప్పటివరకు ఇటుగా వాహనాలు వెళ్లడం వల్ల వ్యాపార, వర్తక, వాణిజ్యాలన్నీ కళకళ్లాడుతుండేవి. ఇప్పుడు ప్రభావం లేక వ్యాపారాలు మందగిస్తున్నాయని లబోదిబోమంటున్నారు.

నేడు మెగా పీటీఎం 3.0

» జిల్లావ్యాప్తంగా విస్తృత ఏర్పాట్లు
» తల్లిదండ్రుల దృష్టికి విద్యార్థుల ప్రగతి
» పాఠశాల నిర్వహణపై చర్చ

7

అసలెలా పంపించారు?

» గురుకుల పాఠశాల నుంచి బాలికను తీసుకెళ్లిన యువకుడు
» బంధువుల ఆగ్రహం
» పోక్సో చట్టం కింద కేసు

7

రైతులకు విస్తృతంగా టార్పాలిన్ల పంపిణీ

» ధాన్యం కొనుగోలుపై జేసీ సమీక్ష

అమలాపురం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ పంటలకు సంబంధించి మాసూళ్లు ముమ్మరంగా ఒకవైపు జరుగుతుండగా మరోవైపు ధాన్యం కొనుగోళ్లను అధికారులు వేగవంతం చేశారు. వర్షాల సీజన్‌లో పంటలను సంరక్షించుకునేందుకు వీలుగా రైతులకు టార్పాలిన్‌ల పంపిణీ పెద్దఎత్తున చేస్తున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని సేకరించి 24 గంటల్లోనే సొమ్ములను అందజేస్తున్నారు. రెండురోజులుగా జేసీ టి.నిషాంతి, సివిల్ సప్లయిస్ మేనేజర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో రైతుల కోసం వివిధ రకాల ఏర్పాట్లు చేశారు. వర్షాల నేపథ్యంలో ధాన్యాన్ని కాపాడుకునేందుకు అవసరమైన టార్పాలిన్లను ఉచితంగా సరఫరా చేస్తున్నట్టు జేసీ నిషాంతి తెలిపారు. జిల్లాలో ఏర్పాటైన కొనుగోలు కేంద్రాలు, సమీప ప్రాథమిక వ్యవసాయ సంఘాల్లో మొత్తం 5228 టార్పాలిన్ షీట్లను అందుబాటులో ఉంచామని, వర్షాల బారిన పడకుండా పంటను జాగ్రత్త చేసుకునేందుకు ఇవి ఉపయోగపడతాయని జేసీ రైతులకు విజ్ఞప్తి చేశారు.

1.85లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు

జిల్లాలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలు విషయంలో లక్ష్యాలు నిర్ణయించినట్టు అధికారులు తెలిపారు. 3.50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంకాగా ఇందుకు 204 కేంద్రాల ద్వారా 39,218మంది రైతులకు చెందిన 1.85లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్టు సివిల్‌సప్లయిస్ మేనేజర్ కె.శ్రీనివాస్ తెలిపారు. 24 గంటల్లో రైతులకు రూ.425.04కోట్లను రైతుల ఖాతాలకు జమ చేస్తామన్నారు. వర్షాల ప్రభావం నుంచి రక్షించుకునేందుకు టార్పాలిన్లు అందుబాటులో ఉంచామన్నారు. గతేడాది కొనుగోలుచేసిన 779, మార్కెటింగ్ శాఖకు సంబంధించి 107 మొత్తం 886 టార్పాలిన్లను ఏర్పాటు చేశామన్నారు. రెడ్‌క్రాస్ సంస్థకు చెందిన 1444 పాత టార్పాలిన్లు కూడా కొనుగోలు కేంద్రాల వద్ద ఉంచామని తెలిపారు. హెడ్ ఆఫీస్ సూచనల మేరకు 2100 టార్పాలిన్లను టెండరు ప్రక్రియ ద్వారా కొనుగోలు చేశామన్నారు.

ప్రతిష్టాత్మకంగా అంతర్వేది లక్ష్మీనరసింహుడి కల్యాణోత్సవాలు

» భక్తులకు అసౌకర్యం కలగకుండా పటిష్టమైన భద్రతా చర్యలు
» కల్యాణోత్సవాల ఏర్పాట్లపై సమీక్షలో కలెక్టర్ మహేష్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్.. ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

అంతర్వేది, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సమన్వయంతో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ అన్నారు. వచ్చే ఏడాది జనవరి 25 నుంచి జరిగే స్వామివారి కల్యాణోత్సవాల ఏర్పాట్లపై అంతర్వేది ఆలయం ఎదురుగా కల్యాణ మండపంవద్ద అధికారులు, ప్రజాప్రతినిధులతో కలెక్టర్ అధ్యక్షతన గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిఏటా మాఘమాసంలో శుద్ధ సప్తమి(రథసప్తమి) నుంచి 9రోజులపాటు అంతర్వేది క్షేత్రంలో లక్ష్మీనరసింహుని దివ్యతిరుకల్యాణ మహోత్సవాలు వైభవంగా సాగుతాయన్నారు. వచ్చేఏడాది జనవరి 25నుంచి ఫిబ్రవరి 2 వరకు స్వామివారి దివ్య తిరుకల్యాణ మహోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లకు సన్నద్ధమయ్యారు. జనవరి 25 సూర్యప్రభ, చంద్రప్రభ వాహనం గ్రామోత్సవాలు, 26న హంస వాహనంపై గ్రామోత్సవం, ధ్వజావరోహణ, 27న సింహవాహనంపై గ్రామోత్సవం, 28న పంచముఖ, కంచుగరుణ వాహన గ్రామోత్సవాల తర్వాత రాత్రి 1.56 గంటలకు రోహిణీ నక్షత్ర యుక్త వృశ్చిక లగ్న పుష్కరాంశలో స్వామి తిరుకల్యాణ మహోత్సవం, 29న భీష్మ ఏకాదశి, మధ్యాహ్నం 2.05 గంటలకు స్వామివారి రథోత్సవం, 30న గజ, పొన్నవాహనంపై గ్రామోత్సవాలు, 31న రాజాధిరాజ అశ్వవాహనం, ఫిబ్రవరి 1వ తేదీ మాఘపౌర్ణమి చక్రవారి సముద్రస్నానం, 2వతేదీ పుష్పక వాహన గ్రామోత్సవం అనంతరం కోనేరులో హంస వాహనంపై స్వామివారి తెప్పోత్సవం, పుష్పోత్సవ కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. గతేడాది మాదిరిగానే అధికారులకు విధులు, బాధ్యతలు కేటాయించామన్నారు. ఆర్టీసీ ట్రాన్స్‌పోర్టేషన్ స్త్రీ శక్తి పథకం ఉన్నందున భక్తులు రద్దీ భారీగా ఉండే అవకాశం ఉన్నందున ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, మలికిపురంలో హాల్ట్ లేకుండా డైరెక్టరుగా అంతర్వేదికి చేరుకునేలా ఆలోచన చేస్తే బాగుంటుందని సూచించారు. పారిశుధ్యం, తాగునీరు, గజఈతగాళ్లు, స్వచ్ఛంద సేవా సంస్థలు, ఆర్‌అండ్‌బీ, మెడికల్, టూరిజం అధికారులతో మాట్లాడారు.

భక్తులకు తగ్గట్లుగా ఏర్పాట్లు: ఎమ్మెల్యే దేవా

అనంతరం ఎమ్మెల్యే దేవవరప్రసాద్ మాట్లాడుతూ గతేడాది కంటే భక్తులు రద్దీ పెరిగేందుకు ఆస్కారం ఉందన్నారు. అంతర్వేది ప్రాంతంలో ఇటీవల సంభవించిన మొంతా తుఫాన్ ప్రభావంతో వంద కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వేస్తాయని, వాతావరణశాఖ ప్రకటించిందని, అటువంటిది 70 మీటర్ల వేగంతో ఎలా వచ్చిందో ప్రతిఒక్కరూ సింహావలోకనం చేసుకోవాలని, దానికి స్వామివారి మహిమే కారణమని అన్నారు. ఈ ఏడాది ఉత్సవాలతో స్వామివారి మహిమను విశ్వవ్యాప్తం చేయాలని సూచించారు. ఉత్సవాలకు గరిష్ఠంగా 10లక్షల మంది భక్తులు తరలివచ్చే ఆస్కారం ఉందని, దానికి తగ్గట్టుగా జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసి అంగరంగ వైభవంగా ఉత్సవాలు నిర్వహించుకునే బాధ్యత అందరిపై ఉందని అన్నారు. మధ్యలో నిలిచిపోయిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలని కోరారు. అంతర్వేది కల్యాణోత్సవాలను రాష్ట్ర పండుగగా ప్రకటించాలని, ఇందుకు సంబంధించి ప్రభుత్వానికి లేఖలు రాశామని తెలిపారు. నాలుగేళ్ల క్రితం రథం కాలిపోయిన పరిస్థితి మూలంగా అపరిష్కృతంగా దేవస్థానంలో ఉందని, దీన్ని ఒక పద్ధతి ప్రకారం నిమజ్జనం చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. కోనేటిని తాగునీటి అవసరాలకు వినియోగిస్తున్నారని, త్వరలో ప్రజలకు మంచినీటి చెరువుగా ప్రారంభిస్తామని తెలిపారు. మళ్లీ కోనేటిని పునరుద్ధరించి తెప్పోత్సవం నిర్వహణకు సిద్ధపరచాలని, అందుకు రూ2కోట్ల మేర అంచనా వ్యయం రూపొందించామని తెలిపారు. స్థానికంగా ఉన్న ఐదెకరాల్లో బస్ టెర్మినల్ నిర్మిస్తే భక్తులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. కోనేరు పునరుద్ధరణ, బస్ టెర్మినల్ నిర్మాణాలకు దాతలు ముందుకు వస్తే వారి పేరిట నిర్మాణం చేపడతామన్నారు. కార్యక్రమంలో జేసీ టి.నిషాంతి, ఎస్పీ రాహుల్‌మీనా, ఆర్డీవోలు కె.మాధవి, అఖిల, శ్రీకర్, ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ చైర్మన్ రాజకలిదిండి కుమారరామగోపాలరాజా బహదూర్, డిప్యూటీ కమిషనర్ రమేష్‌బాబు, అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, ఆలయ ఏసీ ఎంకేటీఎన్వీ ప్రసాద్, డీఎస్పీ సుంకర మురళీమోహన్, సీఐ వి.నరేష్, ఎస్ఐ దుర్గాశ్రీనివాస్, సురేష్, ఎంపీపీ వీరా మల్లిబాబు, ఎంపీటీసీ బైరా నాగరాజు, సర్పంచ్‌లు పాల్గొన్నారు. తొలుత కలెక్టర్, జిల్లా ఎస్పీలు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.

ప్రభుత్వ ఏజెన్సీకి ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు

» కలెక్టర్ మహేష్‌కుమార్



హార్బరులో మత్స్యకారులతో మాట్లాడుతున్న కలెక్టర్

అంతర్వేది, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది పల్లిపాలెంలో నిర్మితమైఉన్న మినీఫిషింగ్ హార్బరుతో ఎంతో మందికి ఉపాధి, అభివృద్ధి కలుగుతుందని కలెక్టర్ మహేష్‌కుమార్ అన్నారు. ప్రభుత్వం తీసుకువచ్చిన ఆర్‌ఆర్ ఏజెన్సీకి పీపీ విధానాన్ని ఎవరైనా వ్యతిరేకిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. అంతర్వేది మినీఫిషింగ్ హార్బరును విద్యుత్, మత్స్యశాఖ అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. హార్బరు అభివృద్ధికి ప్రభుత్వం, ప్రైవేటు(పీపీ) విధానంలో టెండర్ల ద్వారా స్థానిక ఆర్‌ఆర్ ఏజెన్సీకి ఇచ్చామన్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేసుకున్న హార్బర్‌లో ఆర్‌ఆర్ ఏజెన్సీ నిర్వహణ చేసిందని తెలిపారు. విద్యుత్ సౌకర్యం కల్పించి మురుగుబోదెలో పూడికతీసి జంగిల్ క్లియరెన్సు చేసి భవనాలకు రంగులు వేస్తామన్నారు. తాగునీటి ట్యాంకు నిర్మాణం, బంకు ఏర్పాట్లు, మిగిలిన అభివృద్ధి పనులు పూర్తి చేసుకుంటున్న తరుణంలో ఏజెన్సీ ప్రతినిధులు నిర్వహణ కొనసాగించాలన్నారు.వారితో కొందరు వాగ్వివాదానికి దిగడంపై కలెక్టర్ మండిపడ్డారు. ఆర్‌ఆర్ ఏజెన్సీ ప్రతినిధులతో మాట్లాడుకుని 15 రోజుల్లోగా సమస్య లేకుండా చూసుకోవాలని వారు తెలిపారు. వారిని అడ్డుకుని ప్రభుత్వానికి వచ్చే ఆదాయానికి ఆంటకం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జేసీ టి.నిషాంతి, ఎస్పీ రాహుల్‌మీనా, ఆర్డీవో కె.మాధవి, మత్స్యశాఖ జేడీ శ్రీనివాసరావు, డీఎస్పీ మురళీమోహన్, సీఐ నరేష్‌కుమార్, తహశీల్దార్ వెంకటేశ్వర్లు, ఎఫ్‌డీవో ప్రసాద్ పాల్గొన్నారు.

సంతృప్తి స్థాయిలను మెరుగుపరుస్తూ సుపరిపాలన అందించాలి

» జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): వివిధశాఖలద్వారా పథకాలు సమర్థవంతంగా అమలు చేయడంతోపాటు ప్రజావసరాలను దృష్టిలో ఉంచుకుని సంతృప్తిస్థాయిలను మెరుగుపరుస్తూ సుపరిపాలన అందించాలని కలెక్టర్ మహేష్‌కుమార్ ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వివిధ ప్రభుత్వశాఖల పనితీరుపై కలెక్టర్‌తో కాన్ఫరెన్స్ గురువారం నిర్వహించారు. డాక్యుమెంట్ల అప్‌లోడ్, సీజనల్ వ్యాధులు, ఆరోగ్యశాఖ ప్రాధాన్యాలు, ఖరీఫ్ ధాన్యం కొనుగోలు, ఎరువుల సరఫరా వంటి అంశాలపై కలెక్టర్‌తో ప్రధాన కార్యదర్శి విజయానంద్ సమీక్షించారు.

4.70లక్షల ఖాతాల్లో 82.66కోట్లు నిధులు

జిల్లాలో లావాదేవీలు జరగని బ్యాంకు ఖాతాల్లో సొమ్ములు, సరైన పత్రాలు తీసుకువచ్చి వాటిని తీసుకోవాల్సిందిగా జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ కేశవవర్మ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో వివిధ బ్యాంకుల్లో ఉన్న వ్యక్తిగత, ప్రభుత్వ సంస్థాపనమైన 4.70లక్షల ఖాతాల్లో రూ.82.66 కోట్లకుపైగా ధనం నిల్వఉన్నట్టు తెలిపారు. పదేళ్లకుపైగా లక్షలాది ఖాతాల్లో లావాదేవీలు జరగడంలేదని, బ్యాంకు డిపాజిట్లు, ఎల్ఐసీ పాలసీలు, షేర్లు, మ్యుచువల్ ఫండ్స్‌లో ఉన్న సొమ్ములను తిరిగి పొందవచ్చునని అన్నారు. ఈ ఖాతాలకు సంబంధించిన వ్యక్తులు, సంస్థలు సరైన ధ్రువపత్రాలతో వచ్చి ఈ కేవైసీ పూర్తి చేసి తమ సొమ్ములు తీసుకువెళ్లవచ్చునని తెలిపారు. ఆర్‌బీఐ అక్టోబరు నుంచి డిసెంబరు వరకు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు చేపట్టిందని, ఈనెల 5న బ్యాంకు ఆధ్వర్యంలో కలెక్టరేట్ గోదావరిభవన్‌లో ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు.

అమలాపురంలో డీడీవో కార్యాలయం ప్రారంభం

అమలాపురం రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): గ్రామీణప్రాంతాల్లో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుతోపాటు మెరుగైన పాలన అందించే దిశగా పంచాయతీరాజ్ వ్యవస్థలో కూటమి ప్రభుత్వం సంస్కరణలను తీసుకువచ్చిందని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. ఒకేచోట నుంచి ఈ కార్యకలాపాలు నిర్వహించేలా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తీసుకున్న నిర్ణయం అభినందనీయమన్నారు. పేరూరు భీమభక్తునిపాలెంలో డీడీవో కార్యాలయాన్ని ఆయనప్రారంభించారు. కార్యాలయంలో డివిజనల్ డెవలెప్మెంట్ ఆఫీసర్‌తోపాటు పంచాయతీరాజ్ అధికారి డివిజనల్ కార్యాలయం, అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్, డ్వామా కార్యాలయాలను ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నట్టు ప్రకటించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎంవో ఓఎస్డీ నిమ్మకాయల శివరామ్‌ప్రసాద్, డివిజనల్ డెవలప్మెంట్ ఆఫీసర్ జె.వేణుగోపాల్, పంచాయతీరాజ్ డీఈ పీఎస్ రాజ్‌కుమార్, అన్యం రాంబాబు, ఏపీడీ డి.రాంబాబు, డిస్ట్రిక్ట్ జీఎస్‌డబ్ల్యుఎస్ సమన్వయ అధికారి సువిజయ్, డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, ఏఎంసీ చైర్మన్ అధికారి జయవెంకటలక్ష్మి పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు



బిలిమ్బి ఫ్రూట్ మొక్క



రెడ్ పనస



తెనెటీగల పెంపకం తొట్టెలు



ప్రతిక్షణం ప్రశాంతం

పండ్ల తోటల మధ్య గడిపిన ప్రతిక్షణం మనసుకు ఎంతో ప్రశాంతంగా ఉంటుంది. ప్రకృతిపై ఉన్న మమకారంతో సుమారు పదేళ్లుగా మొక్కలను పెంచుతున్నాను. పక్షులను, జంతువులను కుటుంబ సభ్యుల్లా చూసుకుంటాను. ఈ ప్రకృతి నిలయం ఎందరికో ఆదర్శంగా నిలుస్తోంది. ఇందులో పెరిగే మొక్కలను చూసేందుకు ఇతర ప్రాంతాల నుంచి తరలివస్తున్నారు.

చిన్నం తేజారెడ్డి, రావులపాలెం



డ్రాగన్ ఫ్రూట్ మొక్క

పంట పొలాల మధ్యలో అడుగుపెడితే పచ్చదనం కనువిందు చేస్తుంది. పక్షుల కిలకిలరావాలు... పండ్ల వాసనలు, ఆకుల చప్పుళ్లు... ఇవన్నీ కలగలిసిన ఆ మాయ జాలం పేరు ప్రకృతి నిలయం. డాక్టర్‌బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలేనికి చెందిన చిన్నం తేజారెడ్డి కేతారాజుపల్లిలో సృష్టించిన ప్రకృతి సీమ 12 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఇక్కడి అతిథి గృహం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. సరదా కోసం ప్రారంభమైన ఈ పచ్చదన యజ్ఞం ప్రకృతి ప్రేమికులకు ప్రేరణగా నిలుస్తోంది.



- జీవ వైవిధ్యానికి నిలువెత్తు దర్పణం
- పంట పొలాల మధ్య పచ్చదనం
- రావులపాలెం మండలం కేతరాజుపల్లిలో చిన్నం తేజారెడ్డి స్ఫూర్తి కేంద్రం
- 12 ఎకరాల్లో 300 రకాల మొక్కల పెంపకం... గిరిజా కోళ్లు, బాతులు, ఆవులు కూడా...

ప్రకృతి నిలయం

(రావులపాలెం-ఆంధ్రజ్యోతి)

ఇక్కడ మొత్తం 300 రకాల మొక్కలను పెంచుతున్నారు. 30 రకాల మామిడి చెట్లు, 50 రకాల పండ్ల మొక్కలు ఉన్నాయి. ఇవికాక ఇతర జాతులకు చెందిన మొక్కలూ ఉన్నాయి. థైవాన్ జామ, దేశవాళీ జామ, రెడ్ పనస, వేప మామిడి, డ్రాగన్‌ఫ్రూట్, అవకాడో, పాల సపోటా, బత్తాయి, ఉసిరి, మారేడు, తామర పుష్పాలు, మల్బరీ, రేగు, జీడిగింజలు, యాపిల్, సపోటా... ఇలా అనేక రకాలు కనువిందు చేస్తున్నాయి. ఎటువంటి రసాయనాలను వినియోగించకుండా పూర్తి ఆర్గానిక్ పద్ధతిలో పర్యావరణానికి మేలు చేసే విధంగా సహజ ఎరువులతో సాగు చేస్తున్నట్టు తేజారెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు.



సేంద్రియ పద్ధతిలో బంతి పూల సాగు





ప్రకృతి నిలయంలో కోళ్లు, బాతులు, వివిధ రకాల పక్షులు, ఆవు దూడ

కాగా ప్రకృతి నిలయంలో పక్షుల కిలకిలరావాలు ఎప్పుడూ వినిపిస్తూనే ఉంటాయి. గిరిజా కోళ్లు, నాటుకోళ్లు, ఫ్యాన్సీ కోళ్లు, బాతులు, చిన్న ఆవులు, పుంగనూరు ఆవులు, కపిల ఆవులను కూడా ఇక్కడ పెంచుతున్నారు. పక్షుల కిలకిలలు, పండ్లవాసన మధ్య ప్రకృతిని ఆస్వాదించే వారికి ఇది ఒక స్వర్గధామం అని చెప్పవచ్చు. ఇక్కడ కాసిన పండ్లను పక్షులకే పెట్టడం తప్ప ఎటువంటి క్రయవిక్రయాలు జరపకపోవడం విశేషం.



ఆరబెట్టి... బండెనక బండి కట్టి...

దిత్వా తుఫాను ప్రభావంతో ఐదు రోజులుగా ఉన్న ముసురు వాతావరణం వీడింది. కాకినాడ జిల్లా పిఠాపురం, గొల్లప్రోలు ప్రాంతాల్లో ఎండ కాయడంతో వర్షానికి తడిసిన ధాన్యం రాశులను ఒకవైపు ఆరబెడుతూ, మరోవైపు ఆరిన ధాన్యాన్ని బస్తాల్లోకి నింపి ఎప్పటికప్పుడు ఎడ్ల బండ్లపై మిల్లులకు తరలిస్తున్నారు రైతులు. మరలా వాతావరణం మారినా ఇబ్బంది లేకుండా ఉండేందుకు ఇలా ఏర్పాటు చేసుకోవడంతో రహదారులపై ఎడ్లబండ్ల సందడి అధికంగా ఉంది. గురువారం ధాన్యం ఆరబెట్టి, బండెనక బండి కట్టి అనే రీతిలో తరలిస్తున్న దృశ్యాలను 'ఆంధ్రజ్యోతి' క్లిక్‌మనిపించింది.

- గొల్లప్రోలు/పిఠాపురం(ఆంధ్రజ్యోతి)



ఎడ్ల బండ్లపై ధాన్యం బస్తాలు వేసి మిల్లులకు తరలిస్తున్న దృశ్యం



మహా సంస్థానంలో శ్రీపాదశ్రీవల్లభుడు, దత్తాత్రేయుడు, నృసింహ సరస్వతులకు పూలంగి సేవ

జై గురుదేవ దత్త

పిఠాపురం పాదగయ, శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానంలో ఘనంగా దత్తాత్రేయ స్వామి జయంతి

పిఠాపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రంలో వేంచేసియున్న స్వయంభూ దత్తాత్రేయస్వామి సన్నిధిలో దత్త జయంతి గురువారం వైభవంగా జరిగింది. సప్తాహ మహోత్సవాల్లో చివరి రోజున దత్తాత్రేయునికి మహన్యాసపూర్వక శత రుద్రాభిషేకం నిర్వహించారు. సర్వ పుష్పార్చన, దత్తమూలమంత్రాలతో హోమం, పూర్ణాహుతి, అవబృదం జరిగాయి. సాయంత్రం స్వామికి ప్రత్యేక ఊయల సేవ జరిపారు. భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి ఔదుంబర వృక్షం వద్ద, శ్రీపాదశ్రీవల్లభునికి పూజలు జరిపారు. గురుచరిత్ర పారాయణ, పూలంగి సేవ నిర్వహించారు. దత్తమాల ధరించిన భక్తులు ఇరుముడి సమర్పించారు. పాదగయ పుష్కరిణిలో దత్తాత్రేయుని తెపోత్సవం ఘనంగా జరిగింది. హంస వాహనంపై స్వామి విహరించారు. ఈవో కాట్నం జగన్మోహనశ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానంలో ఉదయం మహా గణపతి పూజ, కలశస్థాపన, శ్రీపాదశ్రీవల్లభుల మహిమాన్విత దివ్య పాద పద్మాలకు మహన్యాసపూర్వక ఏకాదశ శతరుద్రాభిషేకం, శ్రీసూక్త, పురుష సూక్తాలతో సహస్ర నామార్చన, మంగళహారతి, మంత్రపుష్పం, వేదపారాయణ, ఋత్వికులచే మూలమంత్ర అనుష్టానం, గణపతి అధర్వశీర్ష ఉపనిషత్ పారాయణ, గురుచరిత్ర, శ్రీపాదశ్రీవల్లభ చరితామృత పారాయణ జరిగాయి. దత్త మంత్ర హోమం అనంతరం పూర్ణాహుతి నిర్వహించారు. స్వాములకు వివిధ హారతులు, సాయంకాలార్చన జరిగాయి. రాత్రి దత్తాత్రేయస్వామి రథోత్సవం కనుల పండువగా జరిగింది. శ్రీపాద శ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహ సరస్వతులకు పూలంగి సేవ, బిల్వార్చన నిర్వహించి విశేషంగా అలంకరించారు. మహారాష్ట్ర, కర్ణాటక, ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు ఉత్తరాది భక్తులు అధికంగా తరలివచ్చారు. దర్శనానికి కిలోమీటరు పొడవునా బారులు తీరారు. అన్నప్రసాద వితరణ జరిగింది. ఈవో సౌజన్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.



పాదగయలో స్వయంభూ దత్తాత్రేయస్వామికి నక్షత్ర హారతి ఇస్తున్న అర్చకుడు



శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానంలో రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఈవో సౌజన్య



పాదగయలో ఇరుముడి సమర్పిస్తున్న దత్తస్వాములు



పాదగయ పుష్కరిణిలో దత్తాత్రేయ స్వామికి తెప్పోత్సవం

ఇకపై ఫిజియోథెరపీ కోర్సుకు నీట్



సర్టిఫికెట్లు అందిస్తున్న జీఎస్ఎస్ చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు

- దేశమంతా ఒకే సిలబస్
- వ్యవధి ఐదేళ్లకు పెంపు
- ఏపీఎస్‌పీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సురేష్‌బాబు రెడ్డి

రాజానగరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఫిజియోథెరపీ కోర్సులో ప్రవేశానికి 2026-27 సంవత్సరం నుంచి తప్పనిసరిగా నీట్ పరీక్షల్లో అర్హత సాధించాలని అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ ఫిజియోథెరపిస్ట్స్(ఏపీఎస్‌పీ)వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎం.సురేష్‌బాబురెడ్డి వెల్లడించారు. రాజానగరం సమీపంలోని జీఎస్ఎల్ ఫిజియోథెరపీ కాలేజీల గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమానికి ఆయన విచ్చేసి మాట్లాడారు. ఈ కోర్సుకు దేశమంతా ఇకపై ఒకే సిలబస్ ఉంటుందని, ఒకే రెగ్యులేటరీ సంస్థ ఏర్పాటవుతుందన్నారు. ఇప్పటి నాలుగేళ్ల ఫిజియోథెరపీ కోర్సు వ్యవధి ఐదేళ్లు పెరిగిందన్నారు. మందులు వాడకుండా కేవలం చేతులతో పేషెంట్లకు నొప్పి తొలగించే హీలింగ్ హ్యాండ్ ఫిజియోథెరపీ, జనరల్ ఫిజియోథెరపిస్టులు స్పెషలైజ్డ్ ఫిజియోథెరపిస్టులుగా నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. జీఎస్ఎల్ ఫిజియోథెరపీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు మాట్లాడుతూ తమ కళాశాల ఇంటర్న్‌షిప్ విద్యార్థులు ఏడాది కాలంలో 12,390 మంది రోగులకు చికిత్స అందించారని, తెలుగు రాష్ట్రాల్లో ఇదే రికార్డని చెప్పారు. రాష్ట్రంలో ఫిజియోథెరిపీలో పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌ను అందిస్తున్న ఏకైక సంస్థ జీఎస్ఎల్ అని అన్నారు. డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ నిర్వహించిన ఎంపీటీ పరీక్షల్లో యూనివర్శిటీ స్థాయిలోని మొదటి మూడు ర్యాంకులు తమ విద్యార్థులే కైవశం చేరుకోవడం అరుదైన రికార్డుగా పేర్కొన్నారు. కార్యక్రమంలో జీఎస్ఎల్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఎస్ గురునాథం, సూపరింటెండెంట్ డాక్టర్ టీవీఎస్‌పీ మూర్తి, జీఎస్ఎల్ స్వతంత్ర ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ వేణుగోపాల్ తదితరులు పాల్గొని మాట్లాడారు.


పోలవరం ఎల్ఎంసీతో అనకాపల్లికి గోదావరి జలాలు

రాజమహేంద్రవరం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): వచ్చే పంట సీజన్ నాటికి పోలవరం ఎల్ఎంసీ ద్వారా అనకాపల్లి వరకూ గోదావరి జలాలను సరఫరా చేస్తామని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. గురువారం పోలవరం ప్రాజెక్టు పనులను పరిశీలించిన తర్వాత పనుల ప్రగతిపై ఆయన సమీక్షించారు. పుష్కరాల కంటే ముందుగానే పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తామన్నారు. ఇప్పటికే 88శాతం పనులు పూర్తయ్యాయని, రూ.600 కోట్లతో ఎడమ ప్రధాన కాలువ పనులు జరుగుతున్నాయన్నారు.వచ్చే ఏడాది డిసెంబరు నాటికి పోలవరం నిర్వాసితులకు పూర్తిగా పరిహారం చెల్లించి, కాలనీల నిర్మాణం పూర్తి చేసే లక్ష్యంతో ముందుకు వెళుతున్నట్టు చెప్పారు. సమావేశంలో ఇరిగేషన్ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ఆర్ అండ్‌ఆర్ కమిషనర్ పి.ప్రశాంతి తదితర అధికారులు పాల్గొన్నారు.

ఏఐ టూల్‌తో విద్యార్థుల సమగ్ర నివేదిక

ఫిజిక్స్ ఉపాధ్యాయుడి ఆలోచన.. మెగా పీటీఎం సందర్భంగా నేడు ఆవిష్కరణ

కరప, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)ను ఉపయోగించి విద్యార్థుల సమగ్ర నివేదికను వారి తల్లిదండ్రుల కళ్లకు కట్టినట్టుగా చూపించగలిగితే ఎలా ఉంటుందనే ఆ మాస్టారి ఆలోచన అందరి మన్ననలు అందుకుంటోంది. కాకినాడ జిల్లా కరప మండలం గురజనాపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో వీవీ రమణమూర్తి ఫిజిక్స్ టీచర్‌గా పనిచేస్తున్నారు. విద్యార్థులందరి మార్కులు, హాజరు, ఇతర డేటాను గూగుల్ జెమిని అప్లికేషన్‌కు అనుసంధానించారు. ఆ డిజిటల్ ఫ్లాట్‌ఫామ్‌పై విద్యార్థి పేరు టైప్ చేయగానే విద్యార్థి ప్రగతికి సంబంధించిన సమస్త సమాచారం టెక్స్ట్ రూపంలో ప్రత్యక్షమవుతుంది. అప్పటి వరకు జరిగిన పరీక్షల్లో సబ్జెక్టుల వారీ మార్కులు, వెనుకబాటుకు గల కారణాలు, సరిదిద్దుకోవాల్సిన అంశాలు, మెరుగుపరుచుకోవడానికి అవసరమైన సూచనలు, ఇలా అన్ని కోణాల్లో సమగ్ర నివేదికను అందజేస్తుంది. ఈ ఏఐ టూల్‌ను శుక్రవారం మెగా పేరెంట్స్ మీటింగ్ సందర్భంగా ఆవిష్కరించనున్నట్టు రమణమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను హెచ్ఎం అళ్ల సాయిమోహన్, ఎస్ఎంసీ చైర్మన్ నూకరాజు,సర్పంచ్ శ్రీనివాస్, స్టాఫ్ సెక్రటరీ ఐ.ప్రసాదరావు తదితరులు అభినందించారు.



ఏఐ ఇచ్చిన ఒక విద్యార్థి సమగ్ర నివేదిక, ఉపాధ్యాయుడు రమణమూర్తి

హాకీ పోటీల్లో విజేతలకు కలెక్టర్ అభినందన

కలెక్టరేట్ (కాకినాడ), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో మహిళల విభాగంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా తరఫున హాకీ క్రీడలలో పాల్గొని రాష్ట్రస్థాయిలో కాకినాడ పీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులు ప్రథమ స్థానం సాధించారు. అలాగే పీఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులు బాలుర విభాగంలో హాకీ క్రీడల్లో రాష్ట్ర స్థాయిలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా తరఫున పాల్గొని ద్వితీయస్థానం సాధించారు. ఈ సందర్భంగా కాకినాడ కలెక్టరేట్‌లో కలెక్టర్ షాన్‌మోహన్ గురువారం వీర్ని ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో మరెన్నీ పోటీల్లో గెలుపొందాలని ఆకాంక్షించారు. జిమ్నాస్టిక్స్‌లో కె.శివగణేశ్ పాల్గొని ఆరు బంగారు పతకాలు, ఒక వెండి పతకం సాధించారు. వెయిట్ లిఫ్టింగ్‌లో నలుగురు విద్యార్థులు బంగారు పతకాలు,ఒక విద్యార్థి వెండి పతకం సాధించారు. కార్యక్రమంలో ఇంటర్మీడియట్ డీఈవీవో శారద, ప్రిన్సిపల్ రాంబాబు, పీడీ రత్నసామ్యూల్, అధ్యాపకులు వర్మ, ప్రేమ్‌కుమారి, శశికళ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కోసం ఎడారి దేశానికి.. హింసకు గురై ఇంటికి

- పేషెంటును చూసుకోవాలని తీసుకెళ్లి గొడ్డు చాకిరీకి పనిలో పెట్టిన వైనం
- తెలుగు ఏజెంట్ల దాష్టీకం
- 2 నెలలు తీవ్రంగా ప్రయత్నించిన భర్త
- పోలీసులు, లోకేశ్ ఆఫీస్ సిబ్బంది నిర్లక్ష్యం
- గత నెల 29న ఇంటికి చేరిన మహిళ

రాజమహేంద్రవరం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం ఎడారి దేశాల దారి పడుతున్న మహిళలు మోసకారి ఏజెంట్ల మాటల వలలో పడి పనిలో చేరిన తర్వాత పడరాని పాట్లు పడుతున్నారు. ఆ బాధను అధికారులు కూడా పట్టించుకోకపోవడం మరింత ఆవేదనకు గురిచేస్తోంది. తూర్పుగోదావరి జిల్లా చాగల్లు మండలానికి చెందిన ఎస్‌కేఎస్.బీబీ వ్యథ అటువంటిదే. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో 8 నెలల కిందట పాలకొల్లుకు చెందిన నాగరాజు అనే ఏజెంట్ ద్వారా బీబీ మస్కట్ వెళ్లింది. అక్కడ ఒక పేషెంటును మాత్రమే చూసుకోవాలని చెప్పారు.అక్కడకు వెళ్లాక రాజమహేంద్రవరానికి చెందిన ప్రియ అనే ఏజెంటు ఆఫీసు ద్వారా ఒక ఇంట్లో పనికి చేరింది. అయితే నాగరాజు చెప్పిన పని కాకుండా.. రోజూ 14 మందికి మూడు పూటలా వండి పెట్టడం, వాళ్ల దుస్తులు ఉతకడం, మూడు అంతస్తుల భవనాన్ని శుభ్రం చేయడం వంటి పనులు అప్పగించారు. దీంతో కొద్ది రోజులకే ఆమెకు నరకం కనిపించింది. అయినా ఉదయం 4గంటల నుంచి రాత్రి 12 గంటల వరకూ గొడ్డు చాకిరీ చేయాల్సి వచ్చేది. ఇదంతా భర్తకు చెప్పినా కొద్ది రోజుల తర్వాత సర్దుకుంటుందని అనుకున్నారు. కానీ పరిస్థితి రోజురోజుకూ ఇబ్బందిగా మారడంతో రెండు నెలల కిందట ఆమెను ఇక్కడికి తీసుకొచ్చే ప్రయత్నాలు ఆరంభించారు. తొలుత చాగల్లు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పట్టించుకోలేదు. తర్వాత కలెక్టర్ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చారు. అక్కడ నుంచి మంత్రి లోకేశ్ కార్యాలయానికి సమాచారం వెళ్లడంతో..ఆ సిబ్బంది ఆమె భర్తకు ఫోన్ చేసి ఏజెంటు ఫోన్‌కి లైన్ కలిపాడు. ఆమెను ఇండియాకు పంపాలంటే రూ.1.5 లక్షలు ఇవ్వాలని ఏజెంటు డిమాండ్ చేశాడు.అంత ఇచ్చుకోలేనని తనకు పరిచయం ఉన్న వారి ద్వారా భర్త ప్రయత్నాలు చేయడంతో మస్కట్‌లోని భారత రాయబార కార్యాలయం రంగంలోకి దిగింది. దీంతో ఆమెను పంపడానికి గత నెల 28న విమానం టికెట్ కొన్నారు. అంతకు 4 రోజుల ముందు మస్కట్‌లోని ఏజెంట్ ప్రియ కార్యాలయానికి బీబీని తీసుకెళ్లి శారీరకంగా హింసించినట్టు ఆమె వాపోయింది. కొట్టి, బూటు కాలితో తన్ని 2 నెలల జీతం, మరికొంత సొమ్ము.. పిల్లల కోసం కొన్న చాక్లెట్లు, దుస్తులను గుంజుకున్నారని కన్నీటి పర్యంతమైంది. ప్రాణాలతో ఇంటికి వెళితే చాలనుకొని బీబీ ఆ బాధను పంటి బిగువున అదిమి పట్టుకొంది. చివరికి 29వ తేదీ ఉదయం ఇండియాకు చేరుకున్నారు. భర్తతో కలిసి ఆమె గురువారం కలెక్టర్ కీర్తిని కలిశారు.అక్కడ ఇంకా తమ వంటి వాళ్లు 12 మంది వరకూ హింస పడుతున్నారని, వాళ్లను రక్షించాలని బీబీ వేడుకొంది. మస్కట్‌లోని ఏజెంటు ప్రియ, పాలకొల్లుకు చెందిన నాగరాజుపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని విన్నవించింది.తన భార్య ఆరోగ్యం బాగుపడాలని లేదంటే తమ జీవితాలు నాశనమవుతాయని, ఇలా ఎవరూ మోసపోకూడదంటూ .. చివరికి కొంత సొమ్ము ఇచ్చే వరకూ ఆమెను పంపించలేదని.. ప్రాణాలతో ఇంటికి చేరదేమో అని ప్రతి క్షణం నరకం అనుభవించానని భర్త కన్నీళ్లు పెట్టుకున్నాడు.



బంధాన్ని బలపరుద్దాం..

మరో విద్యాపండుగకు పాఠశాలలు ముస్తాబయ్యాయి. శుక్రవారం మెగా పీటీఎం-3.0 సమావేశాల నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. తల్లిదండ్రులకు వారి పిల్లల పురోగతిని తెలియజేయడం. పాఠశాలల కార్యకలాపాల్లో వారిని భాగస్వామ్యం చేయడం లక్ష్యంగా ఇప్పటి వరకూ నిర్వహించిన రెండు సమావేశాలు సత్ఫలితాలు ఇచ్చిన నేపథ్యంలో మూడవ సమావేశం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

- నేడు మెగా పీటీఎం 3.0
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విస్తృత ఏర్పాట్లు
- తల్లిదండ్రుల దృష్టికి విద్యార్థుల ప్రగతి
- పాఠశాల నిర్వహణపై చర్చ
- ఉపాధ్యాయులు, పేరెంట్స్ మధ్య వన్ టూ వన్ మీటింగ్

తొండంగి/పిఠాపురం, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాఠశాలల నడుమ బంధాన్ని బలపరిచి పాఠశాలలను మరింత అభివృద్ధి చేసే లక్ష్యంతో ఏర్పాటుచేసిన పేరెంట్ టీచర్స్ మీటింగ్ (పీటీఎం) 1, 2లు విజయవంతం కావడంతో మూడో సమావేశాన్ని కూడా పూర్తి విజయవంతం చేసేందుకు ప్రభుత్వం అన్నిచర్యలు చేపట్టింది. నేడు శుక్రవారం మెగా పీటీఎం 3.0ను నిర్వహించేందుకు పాఠశాలలకు మార్గదర్శకాలు జారీ చేసింది. దేశంలోనే తల్లిదండ్రులు ఉపాధ్యాయులు నిర్వహణలో ఆదర్శవంతంగా నిలవడంతోపాటు గిన్నీస్‌రికార్డు సాధించిన నేపథ్యంలో ప్రస్తుతం జరిగే మెగా పీటీఎంలో మరిన్ని కొత్త అంశాలను విద్యాశాఖ జోడించింది. విద్యార్థులకు బోధనలో వినియోగించే ఎఫ్ఎల్ఎన్ కిట్టు, జాదూ పిఠారా పెట్టెలోని అభ్యసన సామగ్రితోపాటు ఉన్నత పాఠశాలల్లో సైన్స్, సోషల్ ఇతర అంశాల బోధనకు ఉపయోగించే బోధనా సామగ్రి అంతటితో ప్రదర్శన ఏర్పాటు చేసి వచ్చిన వారికి అవగాహన కల్పిస్తారు. ఈనెల 10వ తేదీన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా మెగా పేరెంట్ టీచర్ పేరెంట్ మీటింగ్‌లు నిర్వహించనున్నారు. అన్ని యాజమాన్యాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాల్లో ఈ సమావేశాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యాభివృద్ధికి పలు కార్యక్రమాలు నిర్వహిస్తోంది. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పాఠశాలలు, కళాశాలల పనితీరు, విద్యాబోధనలో పలు మార్పులు తీసుకువచ్చారు.

సమావేశాల నిర్వహణ ఇలా..

అన్ని పాఠశాలల్లో జరిగే సమావేశాలను ఏ రీతిలో నిర్వహించాలనే విషయంపై ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ మెగా పీటీఎం 3.0లో ప్రధానంగా విద్యార్థుల ప్రగతిని తల్లిదండ్రులకు వివరిస్తారు. గురువారం ఉదయం 9నుంచి 9.30గంటల వరకూ సమావేశానికి వచ్చే తల్లిదండ్రులు, విద్యావేత్తలు, ప్రముఖులు, అధికారులు, పూర్వ విద్యార్థులను ఆహ్వానించాలి. పేరెంట్స్‌ను వారి పిల్లలుతో కలిసి క్లాస్‌రూమ్‌ల్లో కూర్చునే విధంగా ఏర్పాట్లు చేయాలి.

- ఉదయం 9.30నుంచి 10.50గంటల వరకూ ప్రతి విద్యార్థి తల్లిదండ్రులతో క్లాస్ టీచర్ వ్యక్తిగతంగా సమావేశం కావాలి. ఇందులో ఇప్పటివరకూ జరిగిన సమ్మెటివ్, ఫార్మటివ్ అసెస్‌మెంట్ పరీక్షలకు సంబంధించి సబ్జెక్టుల వారీగా విద్యార్థులు రాసేందుకు ఇచ్చిన అసెస్‌మెంట్ బుక్‌లెట్లు చూపించి వారి ప్రగతిని వివరించాలి. హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డు గురించి తెలియజేయాలి. విద్యార్థి లేదా విద్యార్థినికి సంబంధించిన ప్రతి విషయాన్ని వారితో పంచుకోవాలి. వన్ టూ వన్ సమావేశాలు జరిగే సమయంలో తరగతి గదిలో ఉన్న తల్లిదండ్రులకు లీప్‌యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకునేలా అవగాహన కల్పించాలి. వీడియోలద్వారా తల్లికి వందనం పథకం, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పాజిటివ్ పేరెంటింగ్ గురించి వివరిస్తారు.
- 10.50 నుంచి 11గంటల వరకూ టీఎల్ఎం ఎగ్జిబిషన్, పాఠశాలలుకు అందించిన క్రీడా పరికరాలు, ఇతర వస్తువులు పరిశీలన, ఉన్నత పాఠశాలలో ల్యాబ్‌లు, విద్యార్థులు తయారు చేసిన ఎగ్జిబిట్స్ పరిశీలన ఉంటుంది.
- 11.10 నుంచి 12.45 గంటల వరకూ పాఠశాల విద్యాప్రగతి గురించి హెచ్ఎం నివేదిక, ప్రతిజ్ఞ, విద్యార్థులచే పద్యాలు, గేయాలు ఆలాపన, తల్లిదండ్రుల ప్రసంగాలు, పాఠశాల అవసరాలు, ఇప్పటి వరకూ దాతలు ద్వారా వచ్చిన విరాళాలు గురించి వివరణ, విద్యార్థుల ప్రశ్నల, జవాబుల ఓపెన్ సెషన్, విలువల విద్య, ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థుల వందరోజుల ప్రణాళిక గురించి వివరణ తదితర అంశాలను నిర్వహించాలి.

విజయవంతానికి కసరత్తు

మెగా పీటీఎం-3.0 కోసం ముందుగానే విద్యా కమిటీ ప్రతినిధులు, ఉపాధ్యాయులు సమావేశమై కార్యాచరణ సిద్ధం చేసుకున్నారు. ఆ రోజు విద్యార్థులందరూ తమకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్లు ద్వారా అందించిన యూనిఫారమ్, బూట్లు, సాక్సులు, బెల్టులు ధరించి హాజరు కావాలని సూచించారు. అదేవిధంగా తల్లిదండ్రులకు, ఇతర ప్రముఖులకు వ్యక్తిగతంగా విద్యార్థులు లేదా ఉపాధ్యాయులు ద్వారా ఆహ్వానాలు అందించారు. సామాజిక మాధ్యమాల్లో పాఠశాల గ్రూపుల్లో విస్తృత ప్రచారం సాగిస్తున్నారు. మరోవైపు సమావేశాల నిర్వహణ కోసం విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఆయా పాఠశాలలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించారు. కనిష్ఠంగా రూ.900 నుంచి రూ.9,000 వరకూ నిధులు విడుదల చేసినట్లు విద్యాశాఖ వర్గాలు వెల్లడించాయి.

పాఠశాలలు ఇలా

కాకినాడ జిల్లాలో 1,259 ప్రాథమిక పాఠశాలలు ఉండగా, వాటిల్లో 51,256మంది విద్యార్థులు చదువుతుండగా, 104 ప్రాథమికోన్నత పాఠశాలల్లో 14,319మంది, 256 ఉన్నత పాఠశాలల్లో 97,387మంది విద్యార్థులు చదువుతున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 1271 ప్రాథమిక, 72 ప్రాథమికోన్నత, 237 ఉన్నత పాఠశాలలు ఉండగా 1.42లక్షల మంది విద్యార్థులు చదువుతుండగా, తూర్పుగోదావరి జిల్లాలో అన్ని స్థాయిల పాఠశాలలు 973 ఉండగా, 89,085మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ విద్యా ర్థుల తల్లిదండ్రులు అందరూ మెగా పీటీఎంకు హాజరయ్యేలా చూడాలని ఉపాధ్యాయులకు స్పష్టమైన సూచనలు ఇచ్చారు.



ఆకాశంలో కనువిందు

కాకినాడ బీచ్‌లో గురువారం సాయంత్రం ఆకాశంలో కనువిందు చేసింది. సూర్యాస్తమయంవేళ ఆకాశంలో నీలిమబ్బులు ఇలా కుంకుమవర్ణాన్ని సంతరించుకున్నాయి. మబ్బుల లోంచి వస్తూ ప్రకాశించిన సూర్యకాంతులు ప్రకృతి ప్రేమికులకు సరికొత్త అనుభూతిని కల్పించాయి. కాకినాడ ఉప్పాడ బీచ్ వద్ద ఈ సుందర దృశ్యాన్నిఆంధ్రజ్యోతి కెమెరా బంధించింది.

-ఫొటోగ్రాఫర్, కాకినాడ

చింతూరులో మావోయిస్టులకు వ్యతిరేకంగా ర్యాలీ

చింతూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అల్లూరిజిల్లా చింతూరులో గురువారం వివిధ ప్రాంతాలకు చెందిన యువకులు మావోయిస్టులకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారంతా మావోయిస్టుల చర్యలను నిరసిస్తూ నినాదాలు చేశారు. మావోయిజం వద్దు అభివృద్ధి ముద్దు అంటూ నినదించారు. రహదారుల పనులకు వినియోగిస్తున్న యంత్రాలను తగులబెట్టడం, ఇన్‌ఫార్మర్ల నెపంతో అమాయక ఆదివాసీలను హత్యచేయడం ఎంతవరకు సమంజసమని వారంతా మావోయిస్టులను ప్రశ్నించారు. మావోయిస్టుల చర్యల కారణంగా పలు మారుమూల గ్రామాల కు రహదార్ల సౌకర్యం, బస్‌సౌకర్యం కూడా లేకుండాపోయిందని వారంతా ఆరోపించారు. కార్యక్రమంలో పలువురు యువకులు పాల్గొన్నారు.



చింతూరులో మావోయిస్టులకు వ్యతిరేకంగా ర్యాలీ చేస్తున్న గ్రామస్థులు

తప్పిపోయిన బాలుడిని క్షేమంగా అప్పగించిన పోలీసులు



తల్లి వద్దకు చేరిన బాలుడు ఏనాపు జగదీష్

సామర్లకోట, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట గోలివారి వీధికి చెందిన ఏనాపు జగదీష్ అనే అయిదేళ్ల బాలుడు గురువారం మ ధ్యాహ్నం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపాన రింగ్ సెంటర్‌వద్ద ఉన్న సాయిబాబా ఆలయానికి అమ్మమ్మ శేషారత్నంతో కలిసి వచ్చాడు అమ్మమ్మ గుడిలోకి వెళ్లి తిరిగి బయటకు వచ్చి చూసేసరికి తన మనుమడు కనిపించకపోవడంతో ఆదుర్దాగా పరిసర ప్రాంతాలలో వెతికినా కనిపించలేదు. దీంతో సామర్లకోట సీఐ కృష్ణభగవాన్‌కు అందించిన ఫిర్యాదుతో పట్టణంలోని అన్ని సీసీ కెమెరాల సీసీ ఫుటేజీలను పరిశీలించి బాలుడు స్థానిక భీమేశ్వర స్వామి ఆలయం రోడ్డులో ఉన్నట్లు గుర్తించి బాలుడిని క్షేమంగా పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. దీంతో అమ్మమ్మ శేషార త్నం, తల్లి శ్రీదేవిలకు క్షేమంగా పోలీసులు బాలుడు జగదీష్‌ను గురువారం సాయంత్రం అప్పగించారు. సామర్లకోట పోలీసులు చేసిన కృషిని ఎస్పీ బిందుమాధవ్, పెద్దాపురం డీఎస్పీశ్రీహరిరాజు అభినందించారు.

రేపు ఉమ్మడి జిల్లాల అండర్-17 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక

అంబాజీపేట, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): అంబాజీపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఈనెల 6వ తేదీన ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా అండర్-17 బాలుర క్రికెట్ జట్టును ఉమ్మడిజిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఎంపిక చేయనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీం బాషా ఓ ప్రకటనలో తెలిపారు. ఈ క్రీడలలో పాల్గొనే విద్యార్థులు ఉదయం 9గంటలకు స్థానిక క్రీడాప్రాంగణంవద్దకు చేరుకోవాలన్నారు. జిల్లా నుంచి వచ్చిన క్రీడాకారులు వారి వివరాలను ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు కొండేపూడి ఈశ్వరరావు 9346920718, ఎస్.రమాదేవి 9440094984కు సంప్రదించాలని కోరారు.

లారీ ఢీకొని భార్యాభర్తల మృతి

- మరో ఇద్దరికి తీవ్రగాయాలు
- పుట్టిన మూడు నెలలకే తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారి



మృతిచెందిన దంపతులు లీలా ప్రసాద్, సౌమ్య(ఫైల్)

రాజానగరం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై రాజానగరం-నరేంద్రపురం కూడలిలో లారీ ఢీకొని భార్యాభర్తలు అక్కడికక్కడే మరణించారు. మరో ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. తూర్పుగోదావరిజిల్లా రాజానగరం మండలం నందరాడ గ్రామానికి చెందిన జుత్తుక లీలా ప్రసాద్ (20), రాజమహేంద్రవరం సమీపంలోని బర్మాకాలనీకి చెందిన సురేష్ సౌమ్య(21)తో ప్రేమ వివాహం జరిగింది. వీరికి మూడు నెలల కిందట పాప కూడా జన్మించింది. లీలా ప్రసాద్ ఎలక్ట్రికల్ పనిచేసుకుంటూ భార్యను పోషించుకుంటున్నాడు. ఈనేపథ్యంలో గురువారం మధ్యాహ్నం బ్యాంకు పనినిమిత్తం ఇరువురు మోటారు సైకిల్‌పై రాజానగరం బయలు దేరారు. రాజానగరం-నరేంద్రపురం కూడలి వద్ద హైవే దాటుతున్న తరుణంలో రాజమహేంద్రవరం నుం చి వైజాగ్ వైపుగా వేగం గా, నిర్లక్ష్యంగా వస్తున్న లారీ మోటార్ సైకిల్‌ను బలంగా ఢీకొంది. ఈప్రమాదంలో మోటార్ సైకిల్‌పై ప్రయాణిస్తున్న లీలా ప్రసాద్, సురేష్ సౌమ్యలు లారీచక్రాల కింద పడి అక్కడికక్కడే మృతి చెందారు. అలాగే ఇదే ప్రాంతంలో మరో ఇద్దరు మహిళలను కూడా లారీ ఢీకొనడంతో ఇరువురికి తీవ్రగాయాల య్యాయి. గాదరాడకు చెందిన వెంకటలక్ష్మికి కుడికాలుకు బలమైన గాయాలుకాగా, సూర్య కుమారికి కుడికాలుకు మడమ నుజ్జునుజ్జయింది. క్షతగాత్రులను చికిత్సకోసం రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు మృతుల బంధువు సత్తిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎస్.ప్రసన్న వీరయ్యగౌడ్ తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి



సత్యనారాయణ (ఫైల్)

రాయవరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మోటార్ సైకిల్‌పై వెళుతున్న వ్యక్తిని ట్రాక్టర్ ఢీకొట్టడంతో మృతి చెందిన సంఘటనపై రాయవరం పోలీసులు కేసునమోదు చేశారు. ఎస్ఐ డి.సురేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వెంటూరు గ్రామానికి చెందిన చందాల వీరవెంకట సత్యనారాయణ(57) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 3న పని నిమిత్తం తన మోటారు సైకిల్‌పై తాళ్లపాలెం వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా తాళ్లపాలెం-వెం టూరు రోడ్డులో ట్రాక్టర్, ఢీకొట్టిన ప్రమాదంలో సత్యనారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడిపై ఆధారపడి వృద్ధులైన తల్లిదండ్రులు, భార్య భూలక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

అసలెలా పంపించారు?

- మేనమామనంటూ నమ్మించి గురుకుల పాఠశాలనుంచి బాలికను తీసుకెళ్లిన ఓ యువకుడు
- సహకరించిన ఓ మహిళ
- మళ్లీ ఉదయం విడిచిపెట్టిన వైనం
- ముమ్మిడివరం మండలం లంకాఫ్ ఠాణేలంకలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఘటన
- ఆందోళన చేపట్టిన బాలిక బంధువులు
- పాఠశాల సెక్యూరిటీ, ప్రిన్సిపాల్‌పై ఆగ్రహం
- కిడ్నాప్, అత్యాచారం, పోక్సో కేసు నమోదు

మేనమామనంటూ నమ్మించి గురుకుల పాఠశాలనుంచి బాలికను ఓ మహిళ సహకారంతో ఓ యువకుడు తీసుకెళ్ళిన సంఘటన అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం లంకాఫ్ ఠాణేలంకలోని ఓ సాంఘిక సంక్షేమ గురు కుల పాఠశాలలో చోటుచేసుకుంది. ఉదయం ఆ బాలికను విడిచిపెట్టాడు. దీంతో ఆ పాఠశాల సెక్యూరిటీ, ప్రిన్సిపాల్ ఎలా పంపించారని బా లిక బంధువులు ఆందోళన చేపట్టారు. అనంత రం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కిడ్నాప్, అత్యాచారం, పోక్సో కింద కేసు నమోదు చేశారు.

ముమ్మిడివరం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం మండలంలోని లంకాఫ్ ఠాణేలంకలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న మైనరు బాలిక (15)ను ఓ యువకుడు, మరో మహిళ బంధువును అని నమ్మించి ఆ పాఠశాల వసతిగృహం నుంచి తీసుకుపోవడంతో ఆ బాలిక బంధువులు గురుకుల పాఠశాలవద్ద గురువారం ఆందోళనకు దిగి పోలీసులను ఆశ్రయించారు. దీనికి సంబంధించిన బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాట్రేనికోన మండలం పల్లంకుర్రు పంచాయతీ పరిధిలోని ఓ మైనరు బాలిక సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. ఆ బాలిక తల్లి ఉపాధి నిమిత్తం గల్ఫ్‌లో ఉంటుండగా తండ్రి పనులకోసం వేరే రాష్ట్రంలో ఉండడంతో ఆ బాలిక నాన్నమ్మ, తాతమ్మల వద్ద ఉంటూ గురుకుల పాఠశాలలో చదువుకుంటుంది. ఈ మేరకు కాట్రేనికోన మండలం పల్లంకుర్రు పంచాయతీ పరిధిలో మోకా గిరిబాబు బుధవారం ఉదయం వసతిగృహానికి వచ్చి బాలికను ఆసుపత్రికి తీసుకువెళతానని చెప్పి పంపించమనగా గురుకుల పాఠశాలవారు నిరాకరించడంతో మరికొంత సేపటికి ఓ మహిళ తాను ఆ బాలిక మేనమామ భార్యను అని చెప్పి ఆసుపత్రి నిమిత్తం బాలికను గురుకుల పాఠశాల నుంచి తీసుకువెళ్లింది. అయితే బుధవారం సాయంత్రం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ డి.శారద హాజరు పరిశీలనలో ఒక విద్యార్థి తక్కువగా ఉండడాన్ని గుర్తించి ఆ బాలికను ఇంకా పంపలేదని నాన్నమ్మకు ఫోన్ చేయగా తాను ఎవరినీ పంపలేదని, మనుమరాలు ఇంటికి రాలేదని చెప్పగా గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పాఠశాల సెక్యూరిటీపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.. అయితే మోకా గిరిబాబు గురువారం ఉదయం ఆ బాలికను గురుకుల పాఠశాల వద్ద వదిలి వెళ్లిపోయినట్టు సమాచారం. బాలిక నాన్నమ్మ, బంధువులు గురువారం గురుకుల పాఠశాలకు చేరుకుని ఆందోళన చేపట్టి పోలీసులను ఆశ్రయించారు. తాము గురుకుల పాఠశాల లోపలకు వెళ్లాలంటే సవాలక్ష ఆంక్షలు పెడుతున్నారని, అటువంటిది బయటి వ్యక్తులను ఎలా పంపించారని, తన మనుమరాలను ఎలా బయటికి పంపారని ప్రశ్నించి బాధ్యతా రాహిత్యంగా వ్యవహరించిన గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, సెక్యూరిటీపై చర్యలు తీసుకోవాలని, తనమనుమరాలిని తీసుకువెళ్లిన గిరిబాబుపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అమలాపురం డీఎస్పీ టీఎస్‌ఆర్కే ప్రసాద్ పర్యవేక్షణలో ముమ్మిడివరం సీఐ ఎం.మోహన్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ డి.జ్వాసాగర్ కేసు నమోదుచేసి బాలికను వైద్య పరీక్షల నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గిరిబాబు అతనిపాటు వచ్చి బాలికను తీసుకువెళ్లిన మహిళను అర్చనగా గుర్తించినట్టు తెలిసింది.

డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వోపై విచారణ

- పది అంశాలతో కూడిన ప్రశ్నావళి
- వాదనలు విన్పించిన వైద్యులు

చింతూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): చింతూరు డిప్యూటీ డీఎంహెచ్‌వో డా. పుల్లయ్యపై ఉన్న ఫిర్యాదుల మేరకు గురువారం చింతూరులో విచారణ జరిగింది. ఇక్కడి ప్రాథమిక వైద్యశాలల్లో విధులు నిర్వర్తించిన, నిర్వర్తిస్తున్న పలువురు వైద్యాధికారులు డా.పుల్లయ్యపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేయడం, ఆ మేరకు విచారణకు ఆదేశించిన విషయం విధితమే. ఈ క్రమంలో విజయవాడ నుంచి నేషనల్ ప్రోగ్రాం, ఫర్ కంట్రోల్ ఆఫ్ బ్లైండ్‌నెస్ అండ్ విజువల్ ఇంపెయిర్ మెంట్ (ఎన్‌పీసీబీ అండ్ వీఐ) జాయింట్ డైరెక్టర్ డా. బి.సునీల్‌కుమార్ నాయక్ విచారణ అధికారిగా వచ్చారు. గురు,శుక్రవారాలు రెండురోజులపాటు విచారణ జరుగనుంది. డా.పుల్లయ్యపై ఫిర్యాదులు ఇచ్చిన వారిలో పదిమంది వైద్యాధికారులు, ఆరోపణలు ఎదుర్కొంటున్న డా. పుల్లయ్య విచారణ అధికారి ఎదుట హాజరయ్యారు. వారితో విచారణ అధికారి విడివిడిగా మాట్లాడారు. తమ వాదనను విన్పించేందుకు విచారణ అధికారి ఎదుట హాజరైనవారిలో ప్రస్తుతం చింతూరు డివిజన్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఇరువురు వైద్యాధికారులు ఉండగా, ఇక్కడ విధులు నిర్వర్తించి వేర్వేరు ప్రాంతాలకు బదిలీపై వెళ్లిన ఎనిమిదిమంది వైద్యులు హాజరవడం గమనార్హం. కాగా వారందరికీ పది అంశాలతో కూడిన మూడేసి పేజీల ప్రశ్నావళి పత్రాలను విచారణ అధికారి అందించినట్లు సమాచారం. ఈనేపథ్యంలో ఆయా ప్రశ్నావళికి ఆధారాలతో కూడిన సమాధానాలు నేడు తిరిగి విచారణ అధికారికి అందించాల్సి ఉంది. అదేదశలో డా.పుల్లయ్య తనపై ఫిర్యాదులు చేసిన వైద్యాధికారులు విధి నిర్వహణ తీరు, ఆ మేరకు పలు అంశాలతో కూడిన ఆరోపణ పత్రాలను సిద్ధం చేసినట్లు వాటిని విచారణ అధికారికి శుక్రవారం అప్పగించనున్నట్లు సమాచారం. దీంతో విచారణ అధికారి గురువారం సాయంత్రం ఏడుగురాళ్ళపల్లి, లక్ష్మీపురం, నెల్లిపాక గ్రామాలలో నేరుగా పలువురిని కలుసుకొని వైద్యాధికారులుఆరా తీసినట్లు తెలుస్తోంది. ఆంధ్రజ్యోతి విచారణ అధికారి డా.సునీల్‌కుమార్ నాయక్‌ను సంప్రదించగా విచారణ జరుగుతోందని, ఇది శాఖాపరమైన విచారణ కావడంతో విచారణలో తన దృష్టికి వచ్చిన అంశాలను బహిర్గతం చేయలేనన్నారు. పూర్తిస్థాయి విచారణలో తన దృష్టికి వచ్చిన అంశాలను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.

వాకలపూడి సముద్రతీరంలో రసాయనిక వ్యర్థాలు

- ప్రమాదకరమైన కెమికల్స్ లారీని పట్టుకున్న మత్స్యకారులు
- మత్స్య సందపకు హాని కలిగిస్తున్న కంపెనీపై చర్యలు తీసుకోవాలి
- కాకినాడ బీచ్‌రోడ్డులో ఆందోళన చేపట్టిన మత్స్యకారులు

సర్పవరంజంక్షన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా కాకినాడరూరల్ మండలం వాకలపూడి-సూర్యారావుపేట సరిహద్దులోగల శాలోడి ప్రధాన డ్రెయిన్‌లో ట్యాంకర్ నుంచి తీసుకొచ్చిన రసాయనిక వ్యర్థాలను పైపులైన్‌ద్వారా డంపింగ్ చేస్తుండగా మత్స్యకారులు పట్టుకున్నారు. కొన్నేళ్లుగా ప్రమాదకర రసాయనిక వ్యర్థాలు తీసుకొచ్చి సముద్రంలో డంపింగ్ చేస్తుండడంతో మత్స్య సంపద అంతరించుకు పోతుందని, తక్షణమే సదరు కంపెనీ నిర్వాహకుడిని అరెస్ట్ చేసి న్యాయం చేయాలని కోరుతూ గురువారం ఉదయం వాకలపూడి బీచ్ రోడ్డులో శ్రీసాయి శ్రీనివాసా (ఎస్ఎస్ఎస్) ట్రేడర్స్ కంపెనీవద్ద వాకలపూడి హ ర్బర్‌పేట, సూర్యారావుపేట మత్స్యకారులు ఆందోళన నిర్వహించారు. మత్స్యకారుల ఆందోళనతో కాకినాడ-ఉప్పాడ బీచ్‌రోడ్డులో ట్రాఫిక్ స్తంభించింది. దీంతో సర్పవరం పోలీస్‌స్టేషన్ సీఐ బి.పెద్దిరాజు, తహశీల్దార్ ఎస్ఎల్ఎన్ కుమారి, మత్స్యశాఖ ఏడీ కరుణాకర్, పొల్యూషన్‌శాఖ అధికారులు చేరుకుని మత్స్యకారులతో చర్చించారు. ఈసందర్భంగా మత్స్యకారులు మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా ఎస్ఎస్ఎస్ ట్రేడర్స్ కంపెనీ స్థలాన్ని లీజుకు తీసుకున్న వ్యక్తి కరప మండలం పెద్ద కొత్తూరుకు చెందిన చింతా శ్రీనివాస్ లారీ ట్యాంకర్‌లో కెమికల్స్ వ్యర్థాలను తెలంగాణా, ఏపీల నుంచి తీసుకొచ్చి బీచ్‌రోడ్డులోగల సాలోడు ప్రధాన డ్రెయిన్‌లోకి పంపింగ్ చేస్తున్నాడని తెలిపారు. కంపెనీలో ఎటువంటి కార్యక్రమం జరక్కపోవడంతో ప్రధాన గేటుకి తాళంవేసి ఉంటుందని, రాత్రి సమయాల్లో కెమికల్స్ వ్యర్థాలతో రోజుకి సుమారు 3 ట్యాంకర్లు తీసుకొచ్చి, నేరుగా ఉప్పుటేరు, సముద్రంలో కలిసే విధంగా విడిచిపెడుతున్నారని ఆందోదళన వ్యక్తం చేశారు. ప్రమాదకర కాలుష్యకారక రసాయనిక వ్యర్థాలతో తీరంలో నిత్యం చేపపిల్లలు, తాబేళ్లు మృత్యువాత పడుతున్నాయని, జీవనో పాధి దెబ్బతింటుందన్నారు. సముద్రంలో చేప పిల్లలుచచ్చిపోయి, తీరంలో రోజు దర్శనమి స్తున్నాయని వాపోయారు. గేటుకి తాళం వేయడంతో లోపల ఏం జరుగుతుందో బయటకు తెలియదని, ఈ లారీని పట్టుకు నేందుకు కాపలాకాయగా బుధవారం రాత్రి కెమికల్ వ్యర్థాలతో ఉన్న ట్యాంకర్‌ని పట్టుకుని పోలీసులకు సమాచారం ఇచ్చామన్నారు. ఈ సందర్భంగా అధికారులు వచ్చి లారీని సీజ్‌చేసి, షెడ్డులో ఉన్న ఆయిల్ డబ్బాల నుంచి శాంపిల్స్ తీసుకున్నారు. శాంపుల్స్ పరీక్షించిన తర్వాత నిర్వాహకుడిపై చర్యలు తీసుకుంటామని, ప్రమాదకర కాలుష్య కారక వ్యర్థాలు తీరంలో డంపింగ్ చేకుండా చర్యలు తీసుకుంటామని అధికారులు మత్స్యకారులకు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. మత్స్యకారుల ఫిర్యాదు మేరకు చింతా శ్రీనివాస్‌పై కేసు నమోదుచేసి దర్యాప్తు చేయాల్సిందిగా తహశీల్దార్ కుమారి ఆదేశించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పెద్దిరాజు తెలిపారు.



కాకినాడ బీచ్‌రోడ్డులో ఆందోళన నిర్వహిస్తున్న మత్స్యకారులు



శాంపుల్స్ సేకరిస్తున్న తహశీల్దార్ కుమారి, సీఐ పెద్దిరాజు

కనకముత్యాలమ్మ తీర్థ మహోత్సవాలు

అంతర్వేది, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కేశవదాసుపాలెం అంతర్వేది సరిహద్దు ప్రాంతాల్లో వెలసి ఉన్న శ్రీకనకముత్యాలమ్మ, కనకదుర్గమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవార్లను భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. గురువారం ఉదయం నుంచి అమ్మవారికి భక్తులు గరగలు సమర్పించారు.

మంత్రి డోలా పుట్టినరోజు వేడుకలు

పి.గన్నవరం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాజులపాలెం శివారు మర్రిగుంటలో ఎంపీటీసీ నేలపూడి దామోదర్ ఆధ్వర్యంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి పుట్టినరోజు వేడుకలు గురువారం జరిగాయి. స్థానిక నాయకులు, అంగాన్వాడీ కేంద్రంలో చిన్నారులు కేక్‌ను కట్ చేసి మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బారు: ఎమ్మెల్యే


వినతిపత్రం స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

అమలాపురం టౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రజాదర్బారులో వచ్చిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. అమలాపురం క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన ప్రజాదర్బారు నిర్వహించారు. నియోజవర్గంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు హాజరై తమ వ్యక్తిగత, సామాజిక సమస్యలపై అర్జీలను ఎమ్మెల్యేకు అందించారు. 1,030అర్జీలను ఆయన స్వీకరించారు. తక్షణం పరిష్కరించవలసిన సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, టీడీపీరాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, డీసీఎంస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, ఏఎంసీ చైర్మన్ అధికారి జయవెంకటలక్ష్మి,శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు తిక్కిరెడ్డి నేతాజీ, రూరల్ మండల అధ్యక్షుడు చొల్లంగి సత్యసాయిబాబా,కౌన్సిలర్ ఏడిద శ్రీను, ఆశెట్టి ఆదిబాబు, దేవరపల్లి వీరేష్‌కుమార్, గెల్లా మీనాకుమారి, మంథా ఫణి, నడింపల్లి ఉదయబాబు, పచ్చిమాల ఏడుకొండలు, నల్లా చిట్టిబాబు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్, వివిధశాఖల అధికారులుపాల్గొన్నారు.

కూటమిలో పంచాయతీలకు కొత్త వెలుగులు


డీడీవో కార్యాలయాలను వర్చువల్‌గా ప్రారంభిస్తున్న ఉపముఖ్యమంత్రి పవన్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న కూటమి నాయకులు, అధికారులు

ఉప్పలగుప్తం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలో పంచాయతీలకు అన్ని విధాల చేయూత లభిస్తోందని టీడీపీ మండలాధ్యక్షుడు అరిగెల నానాజీ, జనసేన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సంయుక్త కార్యదర్శి చిక్కం భీముడు అన్నారు. డీడీవో కార్యాలయాలను రాష్ట్ర వ్యాప్తంగా వర్చువల్ విధానంలో డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ గురువారం ప్రారంభించారు. ఈప్రారంభ కార్యక్రమాన్ని ఎంపీడీవో కార్యాలయంలో కూటమి నాయకులు, అధికారులు వీక్షించారు. పంచాయతీల సమగ్ర అభివృద్ధికి పవన్‌కళ్యాణ్ తీసుకుంటున్న చర్యలను కూటమి నాయకులు ప్రస్తావించారు. పల్లెపండుగల ద్వారా పవన్ గ్రామాలకు కొత్త కళ తెస్తున్నారని అన్నారు. పంచాయతీరాజ్‌లో ఉద్యోగులకు పదోన్నతి కల్పించడంలో పవన్ చర్యలను ఉద్యోగులు ప్రశంసించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి.కృష్ణ, ఎంపీడీవో కార్యాలయపాలనాధికారి బీహెచ్ తులసీకృష్ణ, కూటమి నాయకులు అడబాల సత్యనారాయణ, నాగులపల్లి రాజు, చిక్కం వెంకటకృష్ణ, మంచెం బాలకృష్ణ, నల్లా సత్యనారాయణ, చిక్కం సూర్యమోహన్ పాల్గొన్నారు.

పి.గన్నవరం, (ఆంధ్రజ్యోతి): చిత్తూరు డీడీవో కార్యాలయాన్ని గురువారం డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ వర్చువల్‌గా ప్రారంభించారు. ఈకార్యక్రమాన్ని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీవో ఎం.మధుసూదనరావు, పరిపాలనాధికారి శర్మ, కార్యాలయం, సచివాల యం సిబ్బంది వీక్షించారు. గ్రామస్థాయిలో స్థానిక సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రజల ఆర్థిక అవసరాలకు ఎల్ఐసీ పాలసీలు


మాట్లాడుతున్న సత్యనారాయణ సాహు

అమలాపురం రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): భవిష్యత్తులో ప్రజల ఆర్థిక అవసరాలకు అనుగుణంగా ఎల్ఐసీ నూతన పథకాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చిందని రాజమహేంద్రవరం సీనియర్ డివిజనల్ మేనేజర్ సత్యనారాయణ సాహు పేర్కొన్నారు. కామనగరువులోని మేధా గార్డెన్స్‌లో ఎల్ఐసీ ఏవోఐ యూనియన్ వార్షికోత్సవ సభ గురువారం సానబోయిన వీరభద్రరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా ఎల్ఐసీ నూతనంగా తీసుకువచ్చిన అనేక పథకాల గురించి సాహు, డివిజనల్ మార్కెటింగ్ మేనేజర్ ఎ. వెంకటేశ్వర్లు, సేల్స్ మేనేజర్ ఎస్ఎస్ఎస్ శర్మ వివరించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. యూనియన్ అధ్యక్షునిగా ఉన్న వీరభద్రరావు డివిజన్‌కు అధ్యక్షుడిగా ఎంపిక కావడంతో ఆయన స్థానంలో అయినవిల్లి నాగేంద్రకుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం జిల్లాలో అత్యధిక పాలసీలు చేసిన వారికి బహుమతులు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో అంబాజీపేట శాటిలైట్ బ్రాంచి మేనేజర్ పీవీఎస్ రవీంద్రకుమార్, అమలాపురం అసిస్టెంట్ బ్రాంచి మేనేజర్ కె. వెంకటమధుబాబు, డెవలెప్మెంట్ ఆఫీసర్ ఎస్. రాజేంద్ర, ఎస్ఎస్ నాయుడు, శీలం లంకేశ్వరుడు, దొమ్మేటి శివస్వామి పాల్గొన్నారు.

రోశయ్య వర్ధంతి

అమలాపురం టౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య వర్ధంతి సందర్భంగా అమలాపురం శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి వైశ్య సంఘం ఆధ్వర్యంలో గురువారం పచ్చిగోళ్ళ జనార్ధనరావు కల్యాణ మండపం వద్ద రోశయ్య విగ్రహానికిక పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సంఘ అధ్యక్షుడు నంబూరి సత్యనారాయణమూర్తి, కార్యదర్శి నంబూరి నరేష్, కోశాధికారి కొమ్మూరి ప్రసాద్, ముఖ్య సలహాదారు వరదా సూరిబాబు, కమిటీ సభ్యులు, ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

రాజోలు, (ఆంధ్రజ్యోతి): తాటిపాకలో మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య నాల్గో వర్ధంతిని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్యవైశ్యసంఘ అధ్యక్షుడు కంచర్ల బాబి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. తాటిపాక సెంటర్‌లో ఉన్న రోశయ్య విగ్రహానికి ఆయన పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం 250మంది పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు పోశెట్టి సూరిబాబు, లక్కింశెట్టి బాబులు, కాసు శ్రీనివాస్, జిల్లా కోశాధికారి కంచర్ల కృష్ణమోహన్, లక్కింశెట్టి రత్నబాబు, లక్కింశెట్టి నానాజీ, జిల్లా కార్యవర్గ సభ్యుడు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు అండగా ఎస్టీయూ


ప్రమాణం చేస్తున్న ఎస్టీయూ కార్యవర్గ సభ్యులు

మామిడికుదురు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎస్టీయూ సంఘం ఉపాధ్యాయులకు ఎప్పుడూ అండగా ఉంటుందని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పోతంశెట్టి దొరబాబు, ప్రధాన కార్యదర్శి సరిదే సత్యపల్లంరాజు అన్నారు. మామిడికుదురు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్టీయూ సర్వసభ్య సమావేశం మండలశాఖ అధ్యక్షుడు కారుపల్లి కల్యాణ్‌బాబు అధ్యక్షతన గురువారం జరిగింది. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కరించడంలో ఎస్టీయూ విశేష కృషి చేస్తుందని ఎంఈవోలు లక్ష్మీనారాయణ, వెంకన్నబాబు పేర్కొన్నారు. ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న వారితో పాటు పలువురు ప్రముఖులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో భాగంగా మండలశాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చిక్కం రవికుమార్, ప్రధాన కార్యదర్శిగా నేల వెంకటేశ్వరరావు, ఆర్థిక కార్యదర్శిగా కొట్నాల కిరణ్‌కుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పి.చిరంజీవిరావు, కె.హరినాథ్, జి.నాగప్రసాద్, జిల్లా కార్యదర్శి నేరేడుమిల్లి సత్యనారాయణ, తోట బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

అయినవిల్లి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): అమలాపురంలో రిలయన్స్ ధీరూభాయ్ అంబానీ క్విజ్ పోటీల్లో ముక్తేశ్వరం జడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులు బొక్కా యశ్విన్, యల్లమెల్లి జానకీరామ్‌లు ఐదో స్థానం సాధించారు. జిల్లా బాలికా శిశుసంక్షేమా అధికారి ఎంవీకే భీమారావు, రిలయన్స్ ఎండీల చేతులమీదుగా విద్యార్థులు ప్రశంసాపత్రాలు, సైకిళ్లను బహుమతులుగా పొందినట్టు పాఠశాల హెచ్ఎం నిమ్మకాయల గణేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. అత్యుత్తమ ప్రతిభ చూపి విజేతలుగా ఎన్నికైన విద్యార్థులను గైడ్స్ టీచర్ గుబ్బల సాయిశ్రీనివాస్‌ను జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా, సమగ్రశిక్ష ప్రాజెక్టు కోఆర్డినేటర్ జి.మమ్మి, అకడమిక్ మోనటరింగ్ అధికారి రాంబాబు, కొత్తపేట డీఈవో రామలక్ష్మణమూర్తి, ఎంఈవో మెల్లం శ్రీనివాసరావు, పెచ్చెట్టి శ్రీనివాస్, సర్పంచ్ కుడుపూడి శాంతావతి, ఎంపీటీసీ యడ్ల కిరణ్, విద్యాకమిటీ చైర్మన్‌యడ్ల లక్ష్మితో పాటు మరో పాఠశాల హెచ్ఎం నేరేడుమిల్లి సత్యనారాయణ అభినందించారు.

అంబానీ క్విజ్ పోటీల్లో ఆదిత్య విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న లక్ష్మీదేవి

అమలాపురం టౌన్, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): రిలయన్స్ ధీరూభాయ్ అంబానీ క్విజ్-2025 పోటీల్లో అమలాపురం గొల్లగూడెం ఆదిత్య పాఠశాల విద్యార్థులు వరుసగా నాలుగోసారి సత్తా చాటారు. గొల్లగూడెం పాఠశాల విద్యార్థులు 2022 నుంచి 2025 వరకు మొదటి స్థానాన్ని నిలుపుకుంటూ ప్రతీ ఏటా రెండు లాప్‌ట్యాప్స్ గెలుచుకున్నారు. ఈఏడాది క్విజ్‌లో 10వ తరగతికి చెందిన కె.అశ్విన్, యు.జాషువలు విజయం సాధించి రెండు లాప్‌ట్యాప్స్ గెలుచుకున్నారు. విద్యార్థులను ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డా.ఎన్.శేషారెడ్డి, డైరెక్టర్ ఎన్.శృతిరెడ్డి అభినందించారు. పాఠశాలలో గురువారం జరిగిన అభినందన కార్యక్రమంలో ప్రిన్స్‌పాల్ కె.లక్ష్మీదేవి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం

అల్లవరం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని, రైతులు పండించిన పంటను ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. రాష్ట్రంలో ఉన్నది రైతు ప్రభుత్వమని, రైతులకు ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పిస్తుందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సొసైటీ చైర్మన్ మెట్ల రమణబాబు అన్నారు. కొమరగిరిపట్నం మెట్ల రామమూర్తి సహకార సొసైటీ వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అధ్యక్షుడు ఎం.రమణబాబు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో అల్లాడ స్వామినాయుడు, పెద్దిరెడ్డి నాయుడు, సీఈవో కొమ్మూరి సత్తిబాబు, పరసా కిరణ్‌కుమార్, గుర్రం నరసింహమూర్తి, నంధ్యాల సత్యనారాయణ, జనసేన నాయకుడు నల్లా రాము, రైతులు పాల్గొన్నారు.

పాఠశాలను విజిట్ చేసిన సీఎంవో


అంతర్వేది దేవస్థానం మోడల్ ప్రైమరీ స్కూలులో చైల్డ్ నేమ్స్ చార్ట్‌ను పరిశీలిస్తున్న సీఎంవో

అంతర్వేది, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): శుక్రవారం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో జరగబోయే మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ 3.0 సన్నద్ధతను పరిశీలించడానికి అంతర్వేది దేవస్థానం మోడల్ ప్రైమరీ స్కూలును జిల్లా కమ్యూనిటి మొబలైజేషన్ ఆఫీసర్ బి.సుబ్రహ్మణ్యం గురువారం సందర్శించారు. ఉపాధ్యాయులు తయారుచేసిన నూతన స్వాగత ఏర్పాట్లను చూసి ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు వచ్చి వారివారి పిల్లల పేర్లను, చాట్‌పై ఉన్న పేర్లలో గుర్తించి వాటికి కలర్స్ వేయడం అనే కార్యక్రమం వినూత్నంగా నిర్వహించారు. విద్యార్థులు తయారుచేసి ప్రదర్శించిన ఆట సామాగ్రి, విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కార్డులు, విద్యార్థులు అసైన్‌మెంట్ పుస్తకాలు మొదలైనవి చూసి వాటిపై ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. విద్యార్థులు సొంతంగా స్పీచ్ చెప్పడం విని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఆర్.సోమశేఖర్, పి.నాగశ్రీవిద్య, గుబ్బల శ్రీనివాస్, సీహెచ్ భారతి తదితరులు పాల్గొన్నారు. డీవైఈవో జి.సూర్యప్రకాష్ కేశవదాసుపాలెం ఉన్నత పాఠశాలను గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు.పదో తరగతి విద్యార్థులకు వంద రోజుల ప్రణాళికలను పక్కాగా అమలు చేయాలని హెచ్ఎం సత్యవతిని ఆదేశించారు. పాఠశాల పరిశుభ్రత, ఆవరణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

ముగిసిన ప్రాంతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన


బహుమతులు అందిస్తున్న అతిదులు

యానాం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): యానాం విద్యాశాఖ ఆధ్వర్యంలో మూడు రోజులుగా స్థానిక రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో జరుగుతున్న ప్రాంతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన శనివారంతో ముగిసింది. ప్రభుత్వ, ప్రైవేటుపాఠశాలలు, కళాశాలలో వివిధ విభాగాల్లో 117 ప్రదర్శనలు నిర్వహించారు. ఈసందర్భంగా విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ ప్రవీణ్ అధ్యక్షతన స్థానిక చిల్డ్రన్స్ ఆడిటోరియంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో యానాం ఇన్‌చార్జ్ పరిపాలనాధికారి డాక్టర్ టి.రవిశంకర్ హాజరయ్యారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో విశేష ప్రతిభ కనబరచాలన్నారు. విజేతగా నిలిచిన ప్రదర్శన విద్యార్థులకు అతిథులు బహుమతులు అందజేశారు. న్యాయనిర్ణేతలు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'రాష్ట్రంలో గంజాయి మాఫియాను అరికట్టాలి'


కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

అమలాపురం టౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గంజాయి మాఫియాను అరికట్టడంతో పాటు ప్రజా నాట్యమండలి నాయకులు పెంచలయ్య దారుణ హత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ గురువారం రాత్రి అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. తొలుత పెంచలయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గుదే దుర్గాప్రసాద్, కేవీపీఎస్ జిల్లా కన్వీనర్ శెట్టిబత్తుల తులసీరావు, నాయకులు సాపే రమేష్, జి.దైవకృప, జి.మరియమ్మ, రేవు తిరుపతిరావు, ఎం.వెంకటేశ్వరరావు, కె.శంకర్ పాల్గొన్నారు.

రాజ్‌నివాస్... లోక్‌నివాస్...

యానాం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరిలో లెఫ్టినెంట్ గవర్నర్ ఉండే రాజ్‌నివాస్‌ను లోక్‌నివాస్‌గా పేరు మార్చారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో గవర్నర్లు ఉంటే రాజ్‌భవన్‌ను లోక్‌భవన్‌గా, లెఫ్టినెంట్ గవర్నర్లు ఉంటే రాజ్‌నివాస్‌లను లోక్‌నివాస్‌లుగా పేరు మార్చారు. పుదుచ్చేరిలోని గవర్నర్ కార్యాలయం ముఖద్వారం వద్ద లోక్‌నివాస్ నేమ్ బోర్డును ఏర్పాటుచేశారు.



11వ పీఆర్సీ అమలు చేయాలి

అల్లవరం, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): పదకొండో పీఆర్సీ వెంటనే అమలు చేయాలని, క్లస్టర్ల కుదింపులో అదనపు సీఆర్ఎంపీలను అదే మండలాల్లో కొనసాగించాలని మండలవిద్యాశాఖాధికారి కె.కిరణ్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. స్పష్టమైన జాబ్ జాబితా విడుదల చేయాలని, గత ప్రభుత్వంలో ఇచ్చిన హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా సీఆర్ఎంటీల ఆత్మ గౌరవ నిరసన అన్ని కలెక్టర్ కార్యాలయాల ఎదుట డిసెంబరు 8న పెద్దఎత్తున జరపాలని నిర్ణయించినట్టు జిల్లా అధ్యక్షుడు ఎన్.వెంకట్రావు తెలిపారు. డిసెంబరు 22న చలో విజయవాడకు పిలుపునిచ్చామన్నారు. ఎన్.వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి పి.రవికుమార్, కోశాధికారి ఎం.అర్జున్‌లు మండల విద్యాధికారికి వినతిపత్రం అందజేశారు.

దివ్యాంగుల దినోత్సవం

అల్లవరం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): గోడిలంక భవిత కేంద్రంలో గురువారం దివ్యాంగుల దినోత్సవం జరిగింది. డిప్యూటీ కలెక్టర్, అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ సర్వశిక్ష జి.మమ్మీ మాట్లాడుతూ భవిత కేంద్రాల ద్వారా అన్నిరకాల సౌకర్యాలు అందుతున్నందున పిల్లలను చదివించాలన్నారు.

దివ్యాంగులు ముందుకు సాగాలి

అంబాజీపేట, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని ఎంఈవోలు కె.వెంకటేశ్వరరావు, మోక్షాప్రకాష్ అన్నారు. మాచవరం భవితా కేంద్రం వద్ద ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. దివ్యాంగ విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు నీటిపారుదల శాఖ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, సొసైటీ చైర్మన్ అరిగెల సూరిబాబు, ఐఈఆర్టీలు ఎస్‌కే బేగం, ఎం.ఆశా, సీఆర్పీలు గోవిందరాజు పాల్గొన్నారు.

రబీలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలి

అంబాజీపేట, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రబీ పంటకు శివారు ప్రాంతాలకు పూర్తిస్థాయిలో సాగునీరందేలా చర్యలు చేపట్టాలని తహశీల్దారు చినబాబు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సాగునీటి ఎద్దడిపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా తహశీల్దారు చినబాబు మాట్లాడుతూ రబీ పంటకు సంబంధించి సాగునీటి ఎద్దడి ప్రాంతాలను ముందుగానే గుర్తించాలన్నారు. పంట కాలువలను శుభ్రం చేయించి పూర్తిస్థాయిలో సాగునీరు ముందుకు సాగేలా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. సమావేశంలో ఎంపీడీవో బి.మమత, వ్యవసాయ శాఖ, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీఎఫ్ హెడ్‌కానిస్టేబుల్‌కు గుండెపోటు

అల్లవరం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఓడలరేవు ఓఎన్జీసీ టెర్మినల్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్పీఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ ఏఎస్ఆర్కే ప్రసాద్ బుధవారం గుండెపోటు వచ్చి ఆసుపత్రి పాలయ్యారు. సెక్యూరిటీ అధికారులు తీవ్ర ఒత్తిడి తీసుకురావడంతోనే ఎస్పీఎఫ్ సిబ్బంది మానసికంగా, ఆరోగ్య పరంగా ఇబ్బందులకు గురవుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రసాద్ ప్రస్తుతం అమలాపురం కిమ్స్‌ఆసుపత్రిలోచికిత్స పొందుతున్నారు.

సీఆర్ఎంఈటీలను రెగ్యులర్ చేయాలి

అమలాపురం రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): సీఆర్ఎంటీలను విద్యాశాఖలో విలీనంచేసి రెగ్యులర్ చేయాలని, వారికి ఉన్నత అవకాశాలు కల్పించాలని కోరుతూ అమలాపురం తహశీల్దార్ వాసా ఎస్.దివాకర్‌కు వినతిపత్రం అందజేశారు. తొమ్మిదేళ్లగా ఏవిధమైన వేతన పెంపు లేకుండా పనిచేస్తున్న సీఆర్ఎంటీకు స్కూలు అసిస్టెంట్ అర్హతలు ఉన్నందున బేసిక్ వేతనం రూ.44,570 చెల్లించడంతో పాటు రాష్ట్ర పీఆర్సీని అనుసరించి ఎంటీఎస్ అమలు చేయాలని కోరారు. ఫేషియల్ అటెండెన్స్ పీఆర్ఎంటీల పరిధిలోని అన్ని పాఠశాలల్లో వేసే విధంగా అవకాశం కల్పించడంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మెండి శ్రీనుబాబు, ఎం.అనూష, గూటం నాగన్న, డి.నాగమల్లేశ్వరరావు, ఎస్.త్రినాథ్, ఆర్.బాబిపాల్గొన్నారు.

హిందీ భాషా సంఘం సలహా కమిటీ సభ్యుడిగా సాధిక్



మామిడికుదురు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): హిందీ భాష సలహా కమిటీ సభ్యుడిగా నగరానికి చెందిన షంషూ సాధిక్‌ను నియమించారు. నీతి ఆయోగ్ మినిస్ట్రీ ఆఫ్ ప్లానింగ్, మినిస్ట్రీ ఆఫ్ హోం ఎఫైర్స్ ద్వారా తనను హిందీ భాష సభ్యుడిగా నియమించారు. గురువారం ఢిల్లీలో నీతి ఆయోగ్ కార్యాలయంలో కేంద్ర ప్రభుత్వ అధికారులు, మంత్రి రావు ఇంద్రజిత్‌సింగ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బాధ్యతలు చేపట్టినట్టు తెలిపారు. సాధిక్‌ను స్థానికులు పలువురు అభినందించారు.

అందుబాటులో బరకాలు

పి.గన్నవరం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆర్ఎస్‌కేలు, సొసైటీల పరిధిలో రైతుల కోసం 217టార్పాలిన్లు రైతులకు అందుబాటులో ఉంచామని ఇన్‌చార్జి ఏడీఏ సీహెచ్‌డీవిజయకుమార్ తెలిపారు. మండలవ్యాప్తంగా 8క్లస్టర్ల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నామన్నారు. ఉడిమూడి సొసైటీలో 25, ముంగండలో 25, నాగుల్లంకలో 25, నరేంద్రపురంలో 55, పి.గన్నవరంలో 35, గంటి పెదపూడి గ్రామానికి సంబంధించి ఉడిమూడి సొసైటీలో 25, వై.కొత్తపల్లి ఆర్ఎస్‌కేలో 27టార్పాలిన్లు అందుబాటులో ఉంచామన్నారు. మాసూళ్లు పూర్తయిన తరువాత తిరిగి వాటినిసొసైటీల్లో అప్పగించాలని ఏడీఏ సూచించారు.

మాదిగల ఆత్మీయ కలయికను విజయవంతం చేయండి

ఐ.పోలవరం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): అమలాపురంలోఈనెల11న నిర్వహించనున్న మాదిగల ఆత్మీయ కలయికను విజయవంతం చెయ్యాలని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయేలు పిలుపునిచ్చారు. గురువారం కొమరగిరిలో మాదిగల ఆత్మీయ కలయిక బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించారు. సీనియర్ దండోరా నాయకుడు వీధి నాగభూషణం స్వగృహం వద్ద జిల్లా పొలిటికల్ జేఏసీ చైర్మన్ చెయ్యేటి శ్రీనుబాబు అధ్యక్షతన సమావేశం జరిగింది.జాతిఐక్యత కోసం మాదిగల ఆత్మీయ కలయిక నిర్వహిస్తున్నట్టు ఇజ్రాయేలు అన్నారు. సమావేశంలో చుట్టుగుళ్ళ దాసు, వీధిశేఖర్, వీధి లోవరాజు, యు.జాన్సన్, వీధి రవిబాబు, జొన్నాడ అజయ్, ఆకుమర్తి కృష్ణ, వీధి వంశీ పాల్గొన్నారు.

చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి

అమలాపురంరూరల్, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శ్రీశైలం దేవస్థానం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావుకు గురువారం జరిగిన ప్రజా దర్బారులో వినతిపత్రం అందజేశారు. చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు నేతన్న భృతి కింద రూ.25వేలు, కార్మికుల కుటుంబాలకు 200యూనిట్ల ఉచిత విద్యుత్‌ను వెంటనే అమలు చేయడంతో పాటు దేవాంగ కార్పొరేషన్‌ను ప్రకటించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. నాయకులు మాడా మాధవి, కొండా సత్యనారాయణరాజు, బళ్ల శ్రీనివాసచక్రవర్తి, కొండా శ్రీనివాస్, కాశిన బాబి, మాడా పద్మదుర్గాప్రసాద్, దొంతంశెట్టి రమేష్ పాల్గొన్నారు.

విజయలక్ష్మి అమ్మవారికి స్వర్ణ తిలకం

కాట్రేనికోన, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): గెద్దనపల్లి శివారు చింతలమెరకలో శ్రీవిజయలక్ష్మీదుర్గ అమ్మవారికి గురువారం కందికుప్ప వాస్తవ్యులు విల్లా శ్రీనివాస్, యశోద దంపతులు బంగారు బొట్టు, వెండి ముక్కుపుడక సమర్పించారు. చింతపల్లి శ్రీమన్నారాయణ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పురోహితుడు ఆకొండి శ్రీకాంత్‌శర్మ అమ్మవారికి అభిషేకం అనంతరం కుంకుమార్చన నిర్వహించారు. కార్యక్రమంలో కముజు లక్ష్మీరమణారావు, అప్పారి సత్యనారాయణ, వనచర్ల సూర్యపవన్, బొక్కా జగదీష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిండా ముంచిన తుఫాన్

కాట్రేనికోన, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): వరుస తుఫానులుమండల రైతులను ఇబ్బంది పెడుతున్నాయి. 4రోజులుగా కురిసిన వర్షాలకు ధాన్యం తడిసిపోయింది. పండించిన ధాన్యాన్ని దాచుకునేందుకు చోటు లేక రైతులు ఆరుబయట ఆరబెట్టుకుంటున్నారు. నారుపోసేటప్పుడు నీరుండదు. పంట చేతికొచ్చేటప్పుడువాతావరణం అనుకూలించదు. సమయానికి కోత మిషన్లు కూడా అందుబాటులో ఉండవు. వ్యయప్రయాసలకోర్చి పంట పండిస్తుంటే ఆదాయం కన్నావ్యయమే ఎక్కువగా ఉందని రైతులు వాపోతున్నారు.

ప్రభల తీర్థాన్ని రాష్ట్ర పండుగగా గుర్తించడం అభినందనీయం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

మామిడికుదురు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): అంబాజీపేట మండలం జగ్గన్నతోటలో సంక్రాంతి పండుగ రోజుల్లో జరిగే జగ్గన్నతోట ప్రభల తీర్థాన్ని రాష్ట్ర పండుగగా గుర్తించడం అభినందనీయమని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. మామిడికుదురులో ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ ఏటా జరిగే ఈప్రభల తీర్థానికి లక్షల్లో భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలివస్తారని, దీనికి ప్రాధాన్యం ఇస్తూ ప్రభుత్వం రాష్ట్ర హోదా కల్పించేందుకు సుముఖత వ్యక్తం చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. దీనిపై త్వరలో ప్రభుత్వం ఉత్తర్వులు వెలువడనున్నాయని తెలిపారు. రాష్ట్ర పండుగగా గుర్తించినందుకు సీఎం చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కె.వనజాకుమారి, సర్పంచ్ అడబాల తాతకాపు, కొమ్ముల జంగమయ్య, కేఎం, రజా(రజ్వీ), మెండా ఆదినారాయణ పాల్గొన్నారు.

మెగా పీటీఎంను ఘనంగా నిర్వహించాలి

మామిడికుదురు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్‌ను శుక్రవారం ఘనంగా నిర్వహించాలని సమగ్ర శిక్ష సీఎంవో బీవీవీ సుబ్రహ్మణ్యం కోరారు. గురువారం ఆయన నగరం హైస్కూల్‌ను ఆయన సందర్శించి మెగా పేటీఎం నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించి పేరెంట్స్ మీట్‌కు అందరికీ ఆహ్వానాలందాయా లేదా అని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఎంఈవో మోకా వెంకన్నబాబు, నగరం స్కూలు ఇన్‌చార్జి హెచ్ఎం వై.బేబిశ్రీదేవి ఇంకా ఉపాధ్యాయులు ఉన్నారు.

అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లకు దరఖాస్తుల ఆహ్వానం

మామిడికుదురు, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి):అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ ఉద్యోగాలకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ఎంఈవోలు లక్ష్మీనారాయణ, వెంకన్నబాబు తెలిపారు. నగరంజడ్పీ హైస్కూలులో స్కూలు అసిస్టెంట్ హిందీ, ఎస్టీటీ ఉర్దూ పోస్టుకు దరఖాస్తులను మండల విద్యాశాఖఅధికారి కార్యాలయంలో శుక్రవారంలోపు అందించాలని కోరారు. ఐదు నెలల కాలానికి పనిచేయాల్సి ఉంటుందని, స్కూలుఅసిస్టెంట్‌కు 12,500, ఎస్టీటీకీ రూ.10వేలు వేతనం అందిస్తామని, గ్రామం, మండలానికి చెందిన స్థానిక అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు.

పంటకాల్వలను ఆధునికీకరించాలి

మలికిపురం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రధాన, మీడియం, మైనరు డ్రెయిన్లను, అన్ని పంటకాల్వలను తక్షణం ఆధునికీకరించి రైతులను ఆదుకోవాలని వైసీపీ రైతు విభాగం సంయుక్త కార్యదర్శి గుబ్బల రమేష్ డిమాండ్ చేశారు. కాల్వల వెంబడి ఉన్న తూడు, గుర్రపుడెక్కను తీయకపోవడంతో కాల్వలు మారుమూల ప్రాంతాలకు నీరు పారకపోవడంతో రైతులకు ఇబ్బందికరంగా ఉందన్నారు.

శారీరక వైకల్యం విద్యా ప్రగతికి అవరోధం కాదు

రాజోలు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): శారీరక వైకల్యం అనేది విద్యార్థి విద్యా ప్రగతికి మనో వికాసానికి అవరోధం కాదని జిల్లా సమగ్రశిక్ష సీఎంవో బి.సుబ్రహ్మణ్యం అన్నారు. రాజోలు భవిత కేంద్రంలో గురువారం నిర్వహించిన ప్రపంచ దివ్యాంగ దినోత్సవం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా రాజోలు ఎంఈవో ఎస్.మనోహరం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దివ్యాంగులను ప్రోత్సహించడానికే భవిత కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. దివ్యాంగ పిల్లలకు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు రాజోలు సొసైటీ అధ్యక్షుడు కసుకుర్తి త్రినాథస్వామి బహుమతులు అందజేశారు. ఎంఈవో మనోహరం మాట్లాడుతూ దివ్యాంగ పిల్లల కోసం భవిత కేంద్రాల్లో ప్రత్యేక సౌకర్యాలు కల్పించారని తెలిపారు. అనంతరం రాజోలు జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలను ఆయన ముఖ్య అతిథిగా సందర్శించి శుక్రవారం జరగనున్న మెగా పేరెంట్ టీచర్స్ సమావేశం ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. కార్యక్రమంలో వాసవిక్లబ్ సభ్యులు సతీష్, ప్రధానోపాధ్యాయురాలు కె.సరస్వతి, జి.విజయభాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చండీ హోమం

ఐ.పోలవరం, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి):మార్గశిర పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని మురమళ్ళ శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామిఆలయంలో గురువారం భద్రకాళీ అమ్మవారికి చండీహోమం నిర్వహించారు. ఆలయ అర్చకుడు పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో గణపతి పూజ, మండపారాధన, చండీహోమం నిర్వహించారు. పూజాఏర్పాట్లను ట్రస్టుబోర్డుచైర్మన్ దాట్ల రామకృష్ణంరాజు, అసిస్టెంట్‌కమిషనర్ వి.సత్యనారాయణ పర్యవేక్షించారు.

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం




ప్రత్యేక అలంకరణలో భీమేశ్వరస్వామివారు, మాణిక్యాంబ అమ్మవారు

భక్తిశ్రద్ధలతో భీమేశ్వరుడి జన్మనక్షత్ర పూజలు

ద్రాక్షారామ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరుని జన్మనక్షత్ర పూజలు గురువారం ఘనంగా జరిగాయి. స్వామివారి జన్మనక్షత్రం మార్గశిర చతుర్దశిని పురస్కరించుకుని ఉదయం 5 గంటలకు తీర్థపు బిందె, సుప్రభాత సేవ జరిగింది. అనంతరం బాలబోగం సమర్పించారు. ఆలయ అర్చకులు, వేద పండితులు, పురోహితులు, స్వస్తి వాచకులతో 6.00 గంటలకు సంకల్పం, గణపతి పూజ, పుణ్యాహ వచనం అనంతరం భీమేశ్వరస్వామికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. తదుపరి భీమేశ్వరస్వామికి లక్షబిల్వార్చనను నిర్వహించారు. మాణిక్యాంబ అమ్మవారికి లక్షకుంకుమార్చన జరిగింది. ఈ పూజల్లో టీడీపీ నేత వాసంశెట్టి సత్యం తదితరులు పాల్గొన్నారు.

నంది వాహనంపై నగరోత్సవం: భీమేశ్వరస్వామి, మాణిక్యాంబ అమ్మవార్లను నంది వాహనంపై మేళతాళాలు మంగళ వాయిద్యాలతో నగరోత్సవం నిర్వహించారు. నంది వాహనంపై స్వామివారు ఆయా వీధుల్లో భక్తులకు దర్శనం ఇచ్చారు. జన్మనక్షత్రాన్ని పురస్కరించుకుని భీమేశ్వరస్వామి, మాణిక్యాంబ అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

ఆస్థానపూజ: రాత్రి సోమవార మండపంలో స్వామివారికి ఆస్థాన పూజ నిర్వహించారు అనంతరం నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించారు. ఆలయ సహాయ కమిషనరు అల్లు వెంకట దుర్గాభవాని, ఆలయ సిబ్బంది, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

మాసశివరాత్రి కమిటీ ఆధ్వర్యంలో: మాసశివరాత్రి కమిటీ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో వెయ్యి ఒకటి శివలింగాలకు సప్తగోదావరి జలాలతో అభిషేకం జరిపారు. శివమాలధారణ భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం హోమం, పూర్ణాహుతి జరిపారు. మాసశివరాత్రి కమిటీ అధ్యక్షుడు తాళ్ల సాంబశివరావు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



ఏడిదలో జరిగిన సభలో మాట్లాడుతున్న అఖిల భారత కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు అఖిలేష్ శుక్లా

సమస్యలపై పోరాడేది కాంగ్రెస్ పార్టీయే

అఖిల భారత కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు అఖిలేష్ శుక్లా

మండపేట, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై పోరాటం చేసేది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని అఖిల భారత కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు అఖిలేష్ శుక్లా అన్నారు. ఏడిదలో కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కామన ప్రభాకరరావు అధ్యక్షతన గురువారం జిల్లా కిసాన్‌సెల్ రైతు సమావేశం జరిగింది. దీనికి అఖిలేష్ తోపాటు పలువురు కాంగ్రెస్ నేతలు హాజరయ్యారు, తొలుత మాజీ ముఖ్యమంత్రి కె.రోశయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. సభలో అఖిలేష్ మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసి జిల్లాస్థాయిలో ప్రజల పక్షాన పోరాడే వ్యక్తిని అధ్యక్షుడిగా నియమిస్తామని తెలిపారు. అనంతరం కె.ప్రభాకరరావు, పీసీసీ ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస్ పలు అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నేతలు జంగా గౌతమ్, అరిగెల అరుణకుమారి, పాడిశెట్టి సత్యనారాయణ, అల్లూరి రఘురామరాజు తదితరులతో పాటు పార్టీ నాయకులు, రైతులు, స్థానికులు పాల్గొన్నారు. ఏడిదలో జరిగిన సమావేశానికి హాజరైన కాంగ్రెస్ పార్టీ నేతలను కామన సత్కరించారు.



కపిలేశ్వరపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద విలీనంపై హర్షం వ్యక్తం చేస్తూ క్షీరాభిషేకం చేసిన రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బంది

'తూర్పు'లో విలీనంపై హర్షం

కపిలేశ్వరపురం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరిలో మండపేట నియోజకవర్గాన్ని విలీనం చేయడంపై గురువారం రెవెన్యూ ఆధ్వర్యంలో హర్షం వ్యక్తం చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. నియోజకవర్గం విలీనంపై ఎమ్మెల్యే కృషిని పలువురు కొనియాడుతూ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ జి.శ్రీనివాస్, రెవెన్యూ ఉద్యోగులు, కార్యాలయ సిబ్బంది, వీఆర్‌వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి

ఇమ్యునైజేషన్ జిల్లా అధికారి సత్యనారాయణ



అంగర పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ సత్యనారాయణ

కపిలేశ్వరపురం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): అనారోగ్యం కారణంగా ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలందించాలని అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ బి.సత్యనారాయణ వైద్య, ఆరోగ్య సిబ్బందికి సూచించారు. గురువారం అంగర పీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఓపీ రిజిస్ట్రేషన్, ఇన్ పేషెంట్ వార్డు, లేబొరేటరీ, ఫార్మసీ, వ్యాక్సిన్ స్టోరేజ్ రూం, లేబర్ రూం తదితర విభాగాలను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ తనిఖీలో ఇమ్యునైజేషన్ జిల్లా అధికారితో పాటు డాక్టర్ జె. అనూజ ప్రియాంక ఉన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి రత్నకుమారి, వైద్య, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

మెగా పేరెంట్స్ మీటింగ్‌ను విజయవంతం చేయండి



వల్లూరులో సర్పంచ్ మీనా కుమారికి ఆహ్వానపత్రం అందజేస్తున్న హెచ్‌ఎం శ్రీధర్

కపిలేశ్వరపురం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : మండలంలోని వల్లూరు ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో నేడు జరిగే తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని పాఠశాల హెచ్‌ఎం చిట్టూరి వెంకట శ్రీధర్ కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ మెగా పేరెంట్స్ సమావేశానికి తల్లిదండ్రులను, గ్రామ పెద్దలను ఆహ్వానిస్తూ ఉపాధ్యాయులు ఆహ్వాన పత్రాలు అందజేశామన్నారు. కార్యక్రమంలో బాలల భవిష్యత్, వారి పురోగతి, ప్రవర్తన విధానంపై తల్లిదండ్రులకు వివరించి ఇంటి వద్ద ఏం చేయాలనే విషయాలను తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామతులసి తదితరులు పాల్గొన్నారు.

కె.గంగవరం(ఆంధ్రజ్యోతి): నేడు జరగనున్న మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాన్ని విజయవంతం చేయాలని తహశీల్దార్ శ్రీరామ్‌ప్రసాద్ కోరారు. గురు వారం ఆయన పామర్రు జూనియర్ కళాశాలలో పేరెంట్స్ మీటింగ్ విజయవంతం కోసం సన్నాహక సమావేశం నిర్వహించగా, ఆయన పాల్గొని లెక్చరర్స్‌కు పలు సూచనలు చేశారు. కళాశాలలో చదువు తున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఈ సమావేశానికి హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ చంద్ర శేఖర్, వీఆర్వో భద్రరావు తదితరులు పాల్గొన్నారు.

మెగా పీటీఎంకు ఏర్పాట్లు పూర్తి

రాయవరం(ఆంధ్రజ్యోతి): మండలంలోని 12 గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవో- 2 వై.సూర్యనారాయణ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొనాలని ఎంఈవో కోరారు.

వదిలిన తుఫాన్...తేలుతున్న నష్టాలు

• రైతుల గగ్గోలు • రంగుమారిన, మొలకెత్తిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని వినతి

కె.గంగవరం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): తుఫాన్ వదిలింది...వర్షాలు తగ్గాయి. దీంతో ఆయా ప్రాంతాల్లోని రైతులు మాసూళ్లు చేసి టార్పాలిన్లతో కప్పి ఉంచిన రాశులను ఆరబెట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఇటీవల తుఫాన్ కారణంగా వర్షాలు పడటంతో ధాన్యం రాశుల కిందకు నీరు చేరిపోయింది. ఇప్పుడు వాటిని తిరగవేస్తుంటే రైతుల కళ్లల్లో నీళ్లు తిరుగుతున్నాయి. ముఖ్యంగా రోడ్డుపై వేసిన రాశుల కిందకు వర్షం నీరు చేరడంతో తడిసిపోసి మొలకెత్తాయి. రెండు నుంచి నాలుగు బస్తాల వరకూ ధాన్యం పాడైపోయాయని, రంగుమారి, మొలకలు వచ్చాయని రైతులు వాపోతున్నారు. మండలంలో సుమారు 16,764 ఎకరాల్లో వరి పంట సాగైంది. ప్రస్తుతం 90 శాతం మేర వరి కోతలు పూర్తయ్యాయి. ఇప్పటి వరకూ మండలంలో రైతుల నుంచి 16,125 మెట్రిక్ టన్నుల ధాన్యం సీఎంఆర్ ద్వారా విక్రయాలు జరిగాయి. ఇంకా 14,251 మెట్రిక్ టన్నుల రైతుల దగ్గర నుంచి కొనుగోలు చేయాల్సి ఉంది. ఇప్పటికే పడిపోయిన పంటను యంత్రాలతో కోయడానికి ఎక్కువ సమయం పట్టింది. యంత్రాల కొరత కారణంగా వరి పంట కొంత పొలాల్లోనే రాలిపోయింది. ఇప్పుడు తుఫాన్ వల్ల ఇలా పాడైపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు వ్యవసాయశాఖ అధికారులు తమ ఇబ్బందులను గుర్తించి మొలకెత్తిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



మెలకెత్తిన ధాన్యం

నిప్పులగుండాన్ని తొక్కిన భవానీ భక్తులు

ఆత్రేయపురం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ర్యాలి గ్రామదేవత వాగ్ధేవి అమ్మవారి ఆలయం వద్ద నామాల బూరయ్య గురుస్వామి ఆధ్వర్యంలో 100 మంది భవానీమాల ధరించిన భక్తులు నిప్పుల గుండాన్ని తొక్కి భక్తిని చాటుకున్నారు. ర్యాలి, అంకంపాలెం, నార్కెడిమిల్లి తదితర ప్రాంతాల భవానీ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



తడిపొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న మెప్మా సిబ్బంది

తడి,పొడి చెత్తపై అవగాహన

మండపేట, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండపేటలోని పలు వార్డుల్లో ప్రజలకు తడి,పొడి చెత్తపై మెప్మా సిబ్బంది గురువారం అవగాహన కల్పించారు. మండపేటను స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు తడిపొడి చెత్తను వేరు చేసి సహకరించాలని కమిషనర్ రంగారావు కోరారు. కార్యక్రమంలో మెప్మా సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మండపేటలో బడిబస్సులను తనిఖీ చేస్తున్న ఎంవీఐ శ్రీదేవి

బడిబస్సుల తనిఖీ

మండపేట, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) మండపేట మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీదేవి పట్టణంలోని పలు విద్యా సంస్థల బడిబస్సులను గురువారం తనిఖీ చేశారు. ఆయా పాఠశాలలకు చెందిన 10 బస్సులను తనిఖీ చేయగా రెండు బస్సుల్లో సాంకేతిక లోపాలు వున్నట్టు గుర్తించామన్నారు. నిబంధనలు పాటించని పాఠశాల యాజమాన్యాలకు నోటీసులు జారీ చేశామన్నారు. జిల్లా అధికారి డి.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు వాహనాలు తనిఖీలు చేశామని, వాహన యజమానులు సహకరించాలని అమె కోరారు.

ఊపిరిపీల్చుకున్న రైతులు

రావులపాలెం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలు గురువారం తగ్గుముఖం పట్టడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. రావులపాలెం మండలంలో వరి మాసూళ్ల ప్రక్రియలో భాగంగా యంత్రాలతో కోసిన ధాన్యం వర్షం కారణంగా రాశులగానే ఉండిపోయింది. దీంతో ఆయా ప్రాంత రైతులు ధాన్యం దెబ్బతింటుందని ఆందోళన చెందుతున్నారు. గురువారంనాడు వాతావరణం అనుకూలంగా మారడంతో ఎక్కడిక్కడ రైతులు కల్లాల్లో ధాన్యాన్ని ఆరబెట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు.

కంటి వైద్య పరీక్షలు పునఃప్రారంభం

కపిలేశ్వరపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగర పీహెచ్‌సీలో గురువారం కంటి వైద్య పరీక్షలు పునఃప్రారంభమయ్యాయి. ప్రతి గురువారం పీహెచ్‌సీలో ఆప్తలమిక్ అధికారి ఎస్‌వీవీ సత్యనారాయణ ద్వారా కంటి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారిణి రత్నకుమారి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో మల్లిఖార్జునుడు, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ రామారావు, హెచ్‌వీ మేరీమణి, హెల్త్ సూపర్‌వైజర్ నానిబాబు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



కట్టుంగ ఆంజనేయస్వామి ఆలయాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఆలయంలో చోరీ

ఆత్రేయపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కట్టుంగ ఆంజనేయస్వామి ఆలయంలో జరిగిన చోరీలో బంగారం, వెండి వస్తువులు అపహరించుకుపోయారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కట్టుంగ ఆంజనేయస్వామి ఆలయంలో ఈనెల 2న అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని దుండగులు ఆలయ తలుపులు బద్దలుకొట్టి స్వామివారి వెండి, బంగారం వస్తువులు దొంగిలించుకుపోయారన్నారు. ఆలయ నిర్వాహకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ జరిపామన్నారు. క్లూస్‌టీమ్ వేలుముద్రలు సేకరించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు.

సచివాలయ వ్యవస్థపై శిక్షణ

కపిలేశ్వరపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీవో వెలిచేటి శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బందికి, పంచాయతీ కార్యదర్శులకు గురువారం శిక్షణ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయిలో పంచాయతీ కార్యదర్శి, మండల స్థాయిలో జీఎస్‌డబ్ల్యుఎస్ అధికారి, జిల్లా స్థాయిలో జీఎస్‌డబ్ల్యుఎస్ అధికారి సమక్షంలో సచివాలయాలు పనిచేస్తాయన్నారు. నిర్ణీత సమయంలో ప్రజలకు గుడ్ గవర్నెన్స్‌లో భాగంగా సేవలందించాలన్నారు. దరఖాస్తుదారులను గౌరవించి పనిచేయాలన్నారు. కార్యక్రమంలో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ సాయిబాబా, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దత్త జయంతి పూజలు



వెదురుపాక విజయదుర్గ పీఠంలో దత్తాత్రేయుడుకి అభిషేకాలు నిర్వహిస్తున్న దృశ్యం

రాయవరం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపాక విజయదుర్గపీఠంలో మార్గశిర పౌర్ణమి పూజలను గురువారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పౌర్ణమిని పురస్కరించుకుని విజయదుర్గ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ జరిపారు. తొలుతగా విజయ వేంకటేశ్వర స్వామికి సుప్రభాతసేవ, తులసిదళ అర్చనలు చేశారు. అనంతరం విజయదుర్గ అమ్మవారికి లలితా అష్టోత్తర, సహస్రనామాలు, దుర్గాత్రిశతి, ద్వాతింశ నామావళి, లక్ష్మి, సరస్వతి, దుర్గా అష్టోత్తరాలతో కుంకుమ పూజలు, భవానీ శంకర సమేత అష్టలింగేశ్వరస్వామికి ఏకవార రుద్రాభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా పీఠాధిపతి గాడ్ ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు.

ఘనంగా దత్త జయంతి పూజలు: వెదురుపాక విజయదుర్గ పీఠంలో దత్త జయంతి పూజలు ఘనంగా నిర్వహించారు. పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పీఠంలో ఏకముఖ దత్తాత్రేయుడికి పంచ ద్రవ్యాలతో అభిషేకాలు, అష్టోత్తర పూజలు, హారతులు, హోమం, పూర్ణాహుతి నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, విజయదుర్గ సేవా సమితి ప్రతినిధులు గాదే భాస్కరనారాయణ, సత్య వెంకట కామేశ్వరి, బలిజేపల్లి రమ, పెదపాటి సత్యకనకదుర్గ, బుజ్జి, వీఆర్వో బాబి, గాదే కృష్ణ , పలువురు భక్తులు పాల్గొన్నారు.

చింతలూరులో...

ఆలమూరు(ఆంధ్రజ్యోతి): చింతలూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో దత్తత్రేయుడి జయంతిని నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ద్విభాష్యం కాశీవిశ్వనాధశర్మ, అల్లంరాజు భరణిల ఆధ్వర్యంలో దత్త జయంతిని జరిపించారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు.

బాబా ఆలయంలో పారాయణ

కె.గంగవరం(ఆంధ్రజ్యోతి): మండలంలో దత్త జయంతిని భక్తులు భక్తి శ్రద్ధలతో జరిపారు. పాణింగపల్లి సాయిబాబా ఆలయంలో ఉన్న దత్తాత్రేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. బాబా ఆలయంలో పారాయణం, భజనలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు దత్తాత్రేయ స్వామిని, బాబాను దర్శించుకుని పూజలు చేశారు.

మండపేట(ఆంధ్రజ్యోతి): మండపేటలోని తర్వాణిపేటలో వున్న సాయిబాబా మందిరంలో గురువారం దత్త జయంతిని నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు బాబాకు పలు పూజలు చేశారు. జెడ్.మేడపాడులో వున్న బాబా ఆలయం, కేశవరం, ద్వారపూడిలో వున్న బాబా ఆలయాల్లో దత్త జయంతిని జరుపుకున్నారు.



ఆలమూరులోని చింతలూరులో దత్త జయంతి సందర్భంగా పూజలు చేసిన దృశ్యం

సమస్యలు పరిష్కరించాలని సీఆర్పీల నిరసన

ఆత్రేయపురం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో పనిచేస్తున్న సీఆర్పీలు తమ సమస్యలు తక్షణమే పరిష్కరించాలని కోరుతూ గురువారం మండల పరిషత్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. కొన్నేళ్ల నుంచి నుంచి సీఆర్పీలుగా పనిచేస్తున్న తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు.

ఆలమూరు(ఆంధ్రజ్యోతి): మండలంలోని సీఆర్పీలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం ఆందోళన చేపట్టారు. ఇందులో భాగంగా న్యాయమైన తమ కోర్కెలను పరిష్కరించాలని కోరుతూ ఎంఈవో బి.అప్పాజీ, ఎంపీడీవో ఎ.రాజు, తహశీల్దార్ కేజే ప్రకాష్‌బాబులకు మండల సీఆర్పీ (క్లస్టర్ మొబైల్ టీచర్స్)లు పి.శ్రీనివాస్, జి.శ్రీనివాస్, అపర్ణ, జ్యోతి తదితరులు విద్యాశాఖ కార్యాలయం ముందు ఆందోళన చేసి అనంతరం వినతిపత్రాలు అందించారు.

రాయవరం(ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ గురువారం సీఆర్పీలు తహశీల్దారు భాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సీఆర్పీలు తమ సమస్యలపై మాట్లాడారు. కార్యక్రమంలో సీఆర్పీలు సీతా ధనలక్ష్మి, కె.పోసి రాము లు, సీనాసిరి, వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.



ఆత్రేయపురం మండల పరిషత్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న దృశ్యం

అట్టహాసంగా డీడీవో కార్యాలయం ప్రారంభం



కొత్తపేటలోని వాడపాలెంలో డివిజనల్ అభివృద్ధి అధికారి రాజేశ్వరరావుకు మొక్క అందిస్తున్న దృశ్యం

కొత్తపేట, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): వాడపాలెం సచివాలయంలో డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని ఉపముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్ శాఖా మంత్రి పవన్‌కళ్యాణ్ వర్చువల్ పద్ధతిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా కొత్తపేట ఎమ్మెల్యే తనయుడు బండారు సంజీవ్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్‌లు డీడీవో ఎస్‌టీవీ రాజేశ్వరరావుకు మొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో నరేష్‌కుమార్, డిప్యూటీ ఎంపీడీవో నారాయణ, కంఠంశెట్టి శ్రీనివాస్, పాలూరి సత్యానందం, మార్గన గంగాధర్, గూడపాటి రమాదేవి, ముత్యాల బాబ్జి, సలాది రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ద్రాక్షారామ(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ సచివాలయంలో ఏర్పాటు చేసిన డీడీవో కార్యాలయాన్ని గురువారం ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వర్చువల్‌గా ప్రారంభించారు. కార్యక్రమంలో డీడీవో విజయలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ అక్కల రిష్వంత్‌రాయ్, ఎంపీపీలు అంబటి భవానీ, మున్సిపల్ కమిషనర్ రాజు, టీడీపీ నేత వాసంశెట్టి సత్యం, సర్పంచ్ కొత్తపల్లి అరుణ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, జనసేన నాయకులు సంపతి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకం ఆవిష్కరణ: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వర్చువల్‌గా ప్రారంభించిన అనంతరం శిలాఫలకాన్ని ఎంపీపీ భవానీ, సర్పంచ్ అరుణ, ఏఎంసీ చైర్మన్ రిష్వంత్‌రాయ్ తదితరులు ఆవిష్కరించారు.

పాల్ ల్యాబ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

మండపేట, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండపేటలో వున్న గౌతమి మున్సిపల్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన పాల్ ల్యాబ్‌ను గురువారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ప్రారంభించారు. ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని ఎమ్మెల్యే అన్నారు. పాఠశాల హెచ్‌ఎం డి.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి వేగుళ్ల ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో మండల విద్యాధికారులు నాయుడు రామచంద్రరావు, సోమరెడ్డి, పాల్ ల్యాబ్ ఎఫ్ఎంఎస్ ఇన్‌చార్జి సురేష్‌కుమార్, ల్యాబ్ ఇన్‌చార్జి రజని, నోడల్ టీచర్ సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.



మండపేటలో పాల్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

నియోజకవర్గ పరిశీలకుడిగా రిస్వంత్

మండపేట, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండపేట నియోజకవర్గ పార్టీ పరిశీలకుడిగా రామచంద్రపురం మార్కెట్ కమిటీ చైర్మన్ అక్కల రిస్వంత్ నియమితులయ్యారు. పార్టీ పరిశీలకుడిగా నియమితుడైన ఆయన గురువారం మండపేట ఎమ్మెల్యే వేగుళ్లను కలిశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు వీర్రెడ్డి, కె.అప్పన్నబాబు తదితరులు వున్నారు.

దివ్యాంగుల హర్షం

రాయవరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల్లో దివ్యాంగులకు రాజకీయ అవకాశం కల్పించాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటనపై దివ్యాంగుల హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖండవిల్లి భరత్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. గురువారం వెంటూరు గ్రామంలో ఆయన మాట్లాడుతూ ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, అమరావతితో దివ్యాంగ భవన్ నిర్మాణం, వినికిడి లోపం ఉన్నవారికి డిగ్రీ కాలేజీ వంటి వరాలు దివ్యాంగుల ఉన్నతికి దోహదపడతాయన్నారు. దివ్యాంగుల సంక్షేమానికి పాటుపడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మధవ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్లేట్లు అందజేస్తున్న దృశ్యం

వాడపల్లి వెంకన్నకు స్టీల్ ప్లేట్లు బహూకరణ

ఆత్రేయపురం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి నిత్యపూజ, కైంకర్యాలకు రావులపాలానికి చెందిన మహాలక్ష్మి ఫెర్టిలైజర్స్ అధినేత కె.జగన్నాథం 80 స్టీల్ ప్లేట్లు బహూకరించారు. గురువారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్న అనంతరం అన్నప్రసాదంలో పాల్గొన్నారు. ఆలయంలో చేపడుతున్న నిత్యాన్నదాన పథకానికి కొత్తపల్లికి చెందిన మద్దాల వెంకట మురళీగోపాలకృష్ణ- నాగదుర్గావేణి దంపతులు రూ.25,116, తణుకుకు చెందిన జొన్నలగడ్డ శ్రీరామచంద్రమూర్తి- బాలత్రిపుర సుందరి దంపతులు రూ.25,001 విరాళాలు ఇవ్వగా, దాతలకు స్వామివారి చిత్రపటం అందజేశారు. స్వామివారి తిరునక్షత్ర ఉత్సవాలు ఐదవ రోజు ఘనంగా ముగిశాయి. తిరుమంగయి ఆళ్వార్లకు ప్రత్యేక పూజలు, సేవాకాలం, ద్రవిడవేద పారాయణ, సాయంత్రం పల్లకీ మహోత్సవం నిర్వహించారు. ఆలయ ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు ఆయా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఘనంగా అమ్మవారి మహోత్సవం

ఆలమూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): చెముడులంకలోనున్న శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి మహోత్సవం గురువారం ఘనంగా జరిగింది. అమ్మవారి జాతర బుధవారం రాత్రి నిర్వహించగా గురువారం అమ్మవారి తీర్థ మహోత్సవం సందర్భంగా లంక గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. మండలంలోని ఆయా గ్రామాల నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలమూరు ఎస్ఐ జి.నరేష్ ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు.